ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

బుధవారం 07, అక్టోబర్ 2026 16 పేజీలు





# సీతారామా ఎ(ఉ)త్తి'పోతల!

- జూలూర్‌పాడు..చంద్రుగొండల మధ్యన విధ్వంసం
- అనేక చోట్ల లెయింగ్ పాడయింది
- అసలీసంగతి ఇంజనీర్లకు తెలుసా.. తెలియదా
- రాజీవ్ లింక్ మరమ్మతులకు ఇంకెంత సమయం కావాలి
- ఇప్పటికే రెండు మాసాలయింది
- కాంట్రాక్టర్‌ని బాధ్యుణ్ణి చేశారో లేదో అంతుపట్టదు
- నీరు వదిలేందుకు ఇరిగేషన్ సంశయం
- అధికారులు కష్టపడుతున్నా మాట పడాల్సి వస్తున్నది
- ఇక్కడ గుత్తేదారుదే పెత్తనం
- వారి రాజకీయబలం ముందు అంతా మౌనంగా ఉండాల్సిందే



మరింత పాడవుతున్న రాజీవ్‌లింక్

2వ పేజీలో...

## ప్రధాన కాలువలోనే డొల్లతనం

## నాణ్యతాలేమి కట్టలు తెంచుతున్నది

ప్రభాతవార్త ప్రతినిధి/భద్రాద్రికొత్తగూడెం

సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గరిష్ఠంగా 7లక్షలకు పైగా ఎకరాల అదనపు సాగుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విశేష కృషి..ఎందుకనో అక్కరకు రావట్లేదు. డబ్బుకి డబ్బూ వేల కోట్లు ఖర్చవుతోంది. ముఖ్యమంత్రి తో పాటు జిల్లా మంత్రులూ సాగునీటి అమాత్యులూ, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులూ.,కింది స్థాయి యంత్రాంగం..,ఇలా ప్రతీ విభాగం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కి పుసుపూ కుంకుమా అద్ది "పునిస్త్రీ తనాన్ని" తెచ్చిపెట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు. అసలామాటకొస్తే ఎఈ మొదలుకుని ఇఎన్‌సీ దాకా అనుక్షణం ఇదే పనిమీద కనిపిస్తున్నారు. "సార్ ఎక్కడున్నారని ఎవరికి ఫోన్ చేసినా ఇదే లిఫ్ట్ కాలువల పర్యవేక్షణో లేదా కొత్త భూసేకరణో" అంటూ చాలా చాలా బిజీగా ఉంటున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు,సమీక్షలూ ఉండనే ఉన్నాయి. గరిష్ఠంగా రూ.24వేల కోట్ల ప్రజాధనం హారతి కర్పూరంలా కరిగిపోతున్నది. కానీ..9వేల క్యూసెక్కులను మోసుకుపోవాల్సి న ఈ ఎత్తిపోతల కాలువలు మాత్రం అనేక చోట్ల ధ్వంసమౌతున్నాయి. గడచిన ఆగష్టు 14న రాజీవ్‌లింక్ కెనాల్..,ప్రస్తుతం జూలూర్‌పాడు చంద్రుగొండ మండలాల మధ్య ప్రాంతంలోని ప్రధాన కాలువ. బెండాలపాడు సమీపంలో ఈ మెయిన్ కెనాల్ సైడ్ కాంక్రీట్ లెయింగ్స్ నాశనమ య్యాయి. మా ప్రభాతవార్త ప్రతినిధులు స్వయంగా సందర్శించి విషయాన్ని ఈరోజు వెలుగులోకి తేవడం జరిగింది. రెండు బిట్లలో నాసిరకం గుట్టురట్టయితే.,ఒక చోట మాత్రం ముక్కలు ముక్కలయింది. ఏన్కూరు సమీపంలోని వినోభానగర్ నుంచి మెయిన్ కెనాల్ నుంచి

# బీఆర్ఎస్‌లో.. తాటి తుఫాన్



## త్వరలో రాజీనామా

## అవమానం జరిగిందని ఆవేదన

## అనుచరులతో సమాలోచనలు

అశ్వారావుపేట/ప్రభాతవార్త

అశ్వారావుపేట బిఆర్ఎస్ లో మాజీ ఎంఎల్ఎ తాటి వెంకటేశ్వర్లు మళ్ళీ అలజడి రేపారు. మంగళవారం కొత్తగూడెం లో పట్టభద్రుల ఎంఎల్‌సి సన్నాహక సమావేశం జరిగింది. బిఎల్ఓ ల సమన్వయం నిమిత్తం ఇది ఏర్పాటు కాగా., దీనికి హాజరైన తాటి తీవ్ర మనస్తాపం చెందారు. తనకు ఇక్కడ తీరని అవమానం జరిగిందని ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ వాపోయారు. డబ్బుతో రాజ్యసభలు.,ఎంఎల్‌సి లు కొనుక్కున్న వ్యక్తులు..రెండుసార్లు ఎంఎల్‌గా గెలిచి అనేక ప్రతిష్ఠాత్మక పదవులు విజయవంతంగా

2వ పేజీలో...



16వ పేజీలో...

# భద్రాద్రిలో శరన్నవరాత్రి మహోత్సవాలు

## 12 నుంచి 21 వరకు ప్రత్యేక అలంకారాల్లో రామయ్య దర్శనం

భద్రాచలంకల్చరల్, అక్టోబరు 6 (ప్రభాతవార్త)

దక్షిణ అయోధ్య భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్స వాలకు వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి 21వ తేదీ వర కు పది రోజులపాటు స్వామివారికి వివిధ ప్రత్యేక అలంకారాలు, ఉత్స వాలను నిర్వహించ నున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా నిత్య పూజా కార్యక్రమాలతో పాటు

## జీవో 76 దరఖాస్తులపై.. కలెక్టర్ ఫోకస్

16లో...

## పెండింగ్ కేసులు తేల్చండి.. రికార్డుల ఆధారంగా పారదర్శక పరిశీలన

కొత్తగూడెం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:

# సీతారామా "ఎ(ఉ)త్తి" పోతల !!

రాజీవ్‌లింక్ కెనాల్ ఆక్విడెక్ట్ ద్వారా మళ్ళుతున్న విషయం తెలిసిందే. ఈ మార్గంలో అనేకచోట్ల ఇందాక చెప్పినట్లు ఆగస్టులో కాలువల ధ్వంసం మొదలుకాగా.., దీనికి ఈరోజు దాకా కనీస మరమ్మతులు చేపట్టలేదు. అసలేం లేదనకుండా కాలువల్లోకి కొద్దిపాటి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాడయిన పోర్షన్‌లో అత్యవసర మరమ్మతు లేని కారణంగా క్రమేపీ ఇంతకుమునుపే ఏర్పడిన కోత మరింతగా పెరుగుతున్నది. కాలువ కట్టలకు పెద్దఎత్తున నష్టం జరుగుతున్నది. ప్రదేశానికి వెళ్ళి చూస్తే ఈ సీతారామా భారీ లిఫ్ట్ ఇరిగేషన్‌కి ఎంతటి దీనస్థితి ఏర్పడిందో కళ్ళకుకట్టినట్లు కనిపిస్తుంది.

**మరమ్మతులు ఎందుకు చేయడంలేదు**

మెయిన్ కెనాల్ విధ్వంసం విషయాన్ని కాసేపు పక్కన పెడితే., ముందు రాజీవ్ లింక్ కెనాల్ లెయింగ్ అనేకచోట్ల దెబ్బతిని నెలలు గడుస్తున్నా దాన్ని బాగుచేసే దిక్కూదివాణం లేకపోవడం చాలా బాధాకరం. ఆగష్టు 14 తేదీన ఈ గుట్టురట్టయింది. ఆరోజున రాష్ట్రవ్యాప్తంగా సర్కార్ వైపునుంచి నానా హడావిడీ కనిపించింది. ఇంకేముందీ., తక్షణం సమగ్ర విచారణ జరిపించాలని స్వయానా రాష్ట్రముఖ్యమంత్రి ఆదేశించారని., ఇరిగేషన్ మంత్రి అత్యవసర సమీక్ష పెట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారని., అన్నింటికన్నా ముందుగా కాలువలను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు అనివార్యమన్నారని., ఇలా అనేక వార్తలు పుంఖానుపుంఖాలుగా విస్తరించాయి. ఆ వేడి కేవలం కొద్దిరోజుల్లోనే చల్లారినట్లుగా కనిపిస్తున్నది. ఇప్పుడెవరూ కనీసం ఆవైపుగా కూడా చూడటంలేదు.



పోతేపోనీ ఎవరేం చేయగలం అన్న చందంగా సీతారామా కాలువల్ని వదిలేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. 1400 క్యూసెక్కుల సామర్థ్యంగల ఈ కాలువలోకి ఏకంగా 1700 విడుదల చేయడం వల్లనే అనర్థం నెత్తిన పడిందంటూ ఇంజనీరింగ్ విభాగం పొంతనలేని సమాధానాలు ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కానట్లే ఉన్నది. అదే నిజమైతే అందుకు బాధ్యులైన ఇంజనీర్లపై ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేదు. పైగా నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయకుండా తాత్సారం చేయడంలో డిపార్ట్‌మెంట్‌కి ఉన్న పాలనాపర విఫ్ఫులేమిటో కూడా ఎవరూ చెప్పట్లేదు. ఇక్కడే అనేక అనుమానాలు పుట్టుకొస్తున్నాయి. ఎందుకంటే నిర్మాణం జరిగిన కేవలం నెలల వ్యవధిలోనే కాలువలు నాశనమయ్యాయి కాబట్టి..తిరిగి దాని పునరుద్ధరణ అనేది కాంట్రాక్టర్‌దే పూర్తి బాధ్యత. తన జేబులోంచే ఖర్చుచేసి రిపేర్లు చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు కొత్తగా ప్రభుత్వం నుంచి గ్రాంట్ రావాల్సిన అవసరం లేనపుడు..కాంట్రాక్టర్‌తో ఆ పని త్వరగా చేయించవచ్చుగా. అంతేనా లేకపోతే దీనికీ మళ్ళీ మంజూరిలేమైనా ట్రై చేస్తారా. బహుశా ఇది సాధ్యం కాకపోవచ్చును. ప్రజలకు మాత్రం అనేక అనుమానాలు సహజంగా కలుగుతున్నాయి. ఈ జాప్యానికీ.,ఆ నాసిరకపు నిర్మాణాలకూ ఇంజనీర్లను నిందించడం పరిపాటే కానీ.,పరిస్థితిని చూసినప్పుడు మాత్రం వీళ్ళ పాత్ర చాలా పరిమితంగా కనిపిస్తున్నది. రాజకీయంగా లేదా ఇతరత్రా అన్ని రకాలుగా బలవంతులుగా ఉన్న వారి ముందు ఏమీ అనలేని దుస్థితి కొనసాగుతున్నదనే ఆరోపణలున్నాయి. ఇందులో నిజమెంతో తెలియదు గానీ., ఫర్మమని ఏడాదైనా గడవక ముందే., కేవలం ట్రయల్‌రన్ స్టేజ్‌లోనే కాలువల కాంక్రీట్ లెయింగ్స్ ఇలా సర్వనాశనమైపోతుంటే.,

ఇక వీటి ద్వారా భవిష్యత్తులో 9వేల క్యూసెక్కుల గోదారి నీటిని ఏవిధంగా నడిపిస్తారో అంతుపట్టడంలేదు. ఇంజనీర్ల వద్ద మరేదైనా అధునాతన సాంకేతిక పరిజ్ఞానమున్నదో మనకు తెలియదు గానీ.,కంటికి కనిపిస్తున్న పరిస్థితి మాత్రం దయనీయంగా ఉన్నది. నీటిని పూర్తిస్థాయిలో పారించినప్పుడు కాలువల నాణ్యత మరింత ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులే ఎక్కువగా ఉంటున్నాయి. ఇదిలా ఉంటే వినోభానగర్ సమీపంలో రాజీవ్‌లింక్ కెనాల్ నుంచి తీసిన మట్టిని ఒడ్డున పోశారు కదా..దాన్ని అదే కాంట్రాక్టర్ ఆర్అండ్‌బి రహదారి నిర్మాణానికి తరలించుకుపోవడం జరుగుతున్నది. నిజానికి ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌తో నడుస్తున్న ఈ సీతారామా కాలువల మీదనుంచి ఇలా మట్టిని తరలించుకుపోవడం చెల్లదు.

కాగా ఎక్సెస్ సాయిల్ ని అమ్ముకోవచ్చని తెలంగాణా సర్కార్ ఓ స్కీం పెట్టుకున్నది. ఇదే పాయింట్‌మీద కాబోలు..సంబంధిత ఇరిగేషన్ డిఇఇ చంద్రశేఖర్ ఓ మాట అన్నారు. ఆ రోడ్ కాంట్రాక్టర్ ఇరిగేషన్‌కి డబ్బు కట్టిన తరువాతనే మట్టిని తరలించుకుపోతున్నారని.

అంటే కాలువల మీద మట్టిని పట్టుకుపోవాలంటే ఖచ్చితంగా డబ్బు కట్టాలని ఆయన అంగీకరించారు. ఐతే ఇక్కడే ఆయన సమాధానం చెప్పాల్సింది ఇంకోటుంది. తెలంగాణ ప్రభుత్వం పెట్టుకున్న అమ్మకాల స్కీంలో "ఇఫ్ఎనీ ఎక్సెస్ సాయిల్" అనే నిబంధన ఉన్నది. అందువల్ల అసలీ రాజీవ్‌లింక్ కెనాల్‌మీద ఉన్న మట్టి అసలెంత తవ్వారు..ఎంత ఎక్సెస్ ఉన్నది..అనే డాటా ఏమైనా ఈ డిఇఇ చంద్రశేఖర్ వద్ద ఉన్నదో లేదో మాత్రం ఆయన చెప్పలేదు. దీనిపై సమగ్రంగా విషయాన్ని అందించడం జరుగుతుంది. అలానే మెయిన్ కెనాల్స్ భవిష్యత్తుపై సాంకేతిక అంశాలతో కూడిన కథనాలు అందిస్తాం.

## అక్టోబర్ 8న ఖమ్మంలో జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి.

**జిల్లా ఉపాధి అధికారి మాధవి**

**హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్, లెలర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఎంపికలు**

**వివిధ పోస్టులకు రూ.18 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనం**

**ఖమ్మం కలెక్టరేట్ అక్టోబర్06: (ప్రభాతవార్త)**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగం హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్, లెలర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ లలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 8, 2026 (గురువారం) నాడు ఖమ్మంలోని టిటిడిసి, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో వివిధ ఉద్యోగాలు :హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత బ్యాక్ గ్రౌండ్‌తో ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. 1-5 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి ములకపల్లిలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు, నెలకు రూ. 20 వేల నుండి 35 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత బ్యాక్‌గ్రౌండ్‌తో ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 21-35 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 5 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ అనుభవంతో అర్హులని తెలిపారు. ములకపల్లి వర్క్ లొకేషన్ కాగా, నెలకు రూ.20 వేల నుండి 35 వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. మరో డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జ్ పోస్టుకు 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 1-3 సంవత్సరాల అనుభవంతో అర్హులని, వేతనం నెలకు రూ.18 వేల నుండి 25 వేల వరకు ఉంటుందని తెలిపారు.మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత బ్యాక్‌గ్రౌండ్‌తో ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులు. 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ అనుభవం ఉన్న వారికి నెలకు రూ.20 వేల నుండి 30 వేల వేతనంతో ములకపల్లిలో ఉద్యోగ అవకాశం ఉంటుందని తెలిపారు.స్టోర్ ఇన్‌చార్జ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత అర్హత కలిగిన 21-35 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 3-5 సంవత్సరాల అనుభవంతో అర్హులని, నెలకు రూ.25 వేల నుండి40 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. స్టోర్ హెల్పర్ పోస్టుకు 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని, 1-3 సంవత్సరాల అనుభవంతో నెలకు రూ.18 వేలు నుండి 23,000 వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు.క్వాలిటీ విభాగంలో అవకాశాలు :క్వాలిటీ ఇన్‌చార్జ్ పోస్టుకు బ్యాచిలర్ ఇన్ ఫుడ్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన 30-40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 5-10 సంవత్సరాల అనుభవంతో అర్హులని తెలిపారు. ములకపల్లిలో విధులు నిర్వహించాల్సి ఉండగా, నెలకు రూ.60 వేల నుండి 80 వేల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు బ్యాచిలర్ ఇన్ ఫుడ్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన 21-40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 3-5 సంవత్సరాల అనుభవంతో అర్హులని, నెలకు రూ.25 వేలు నుండి 40 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు బ్యాచిలర్ ఇన్ ఫుడ్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 1-3 సంవత్సరాల అనుభవంతో అర్హులని, నెలకు రూ.20 వేలు నుండి 25 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు.కుక్స్/డెక్స్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 5-10 సంవత్సరాల అనుభవంతో అర్హులని తెలిపారు. ములకపల్లిలో ఉద్యోగ అవకాశం ఉండగా, వేతనం అనుభవం, అర్హతల ఆధారంగా నిర్ణయించబడుతుందని పేర్కొన్నారు.ఐటీ, హెచ్ఆర్ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు :ఐటీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు కంప్యూటర్/సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు సంబంధిత బ్యాక్‌గ్రౌండ్ కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 1-3 సంవత్సరాల అనుభవం అవసరమని, ములకపల్లిలో ఉద్యోగం, నెలకు రూ.20 వేల నుండి 30 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు.హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఏదైనా డిగ్రీ/ఎంబీఏతో పాటు సంబంధిత అనుభవం కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 3-5 సంవత్సరాల అనుభవం అవసరమని, ములకపల్లిలో ఉద్యోగం, నెలకు రూ.20 వేల నుండి 30 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు.లెలర్నెట్ స్కిల్స్ లిమిటెడ్‌లో ఇన్ఫోసిస్ గేట్ ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్ :ఇన్ఫోసిస్ గేట్ (ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ) ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్ కోసం కూడా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి తెలిపారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 19-28 సంవత్సరాల వయస్సు గల పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశానికి అర్హులని పేర్కొన్నారు.జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయస్సు సాధారణంగా 19 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. అయితే ప్రతి పోస్టుకు నిర్దేశించిన ప్రత్యేక వయో పరిమితి, విద్యార్హత, అనుభవాన్ని అనుసరించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.అర్హత, ఆసక్తి కలిగిన ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అక్టోబర్ 8, 2026 (గురువారం) ఉదయం 10.00 గంటలకు టిటిడిసి, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా, ఖమ్మంలో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి కోరారు.జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, అవసరమైన జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత, అనుభవానికి అనుగుణంగా ఆయా సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం హెచ్ఆర్ ప్రతినిధులను 7075936289, 9912465999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



## బిఆర్ఎస్‌లో "తాటి" తుఫాన్

**మొదటి పేజీ తరువాయి..**

నిర్వహించిన తనతో అనుచితంగా ప్రవర్తించడం నచ్చలేదని., ఈ పార్టీలో ఇప్పటికే నలుగురు ఆయమన్నా లీడర్లు లేక కునారిల్లుతున్న స్థితిలో మరమ్మతు చేసుకోవాల్సింది పోయి., ఈవిధంగా ప్రవర్తించడం ఈ పార్టీ దౌర్భాగ్యమన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలముందుంచడంలో సంఘటితంగా పనిచేయాల్సిందిపోయి విధ్వంసకర మార్గాన్ని ఎన్నుకుంటున్నారని నొచ్చుకున్నారు. తన లాంటి సీనియర్‌ని అవమానించడంతో పాటుగా కనీస సమాధానమైనా చెప్పడంలేదన్నారు. త్వరలో తన ప్రధాన అనుచరుతో సమావేశమై., ఒక నిర్ణయం తీసుకుంటానని., ఇక ఈ పార్టీలో కొనసాగే పరిస్థితి మాత్రం లేదన్నారు. ఇదిలా ఉంటే కొత్తగూడెం లో సమావేశం జరుగుతుండగానే తాటి వెంకటేశ్వర్లు ఆగ్రహించిన విషయం అందులోని కీలక నాయకులకు తెలిసింది. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర దీనిపై మాట్లాడినట్లు కార్యకర్తలు చెప్పారు. తాము ఎవరినీ అవమానించలేదని.,ఇది కేవలం తాటి వెంకటేశ్వర్లు వ్యక్తిగత అభిప్రాయమని చెప్పినట్లు తెలిసింది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీపై బీఆర్ఎస్ గురి

### ఓటర్ల నమోదుపై స్పెషల్ ఫోకస్..
### గెలుపుపై నేతల ధీమా
### కేసీఆర్ రావాలి.. రేవంత్ పోవాల్సి
### నినాదం ప్రజల్లో ఉందన్న నేతలు




**కొత్తగూడెం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**

ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ఆ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెలాఖరులోగా అర్హులైన పట్టభద్రుల ఓటర్ల నమోదును పూర్తి చేసి ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు నేతలు దిశానిర్దేశం చేశారు. మంగళవారం కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధుసూదన్‌రావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని సునాయాసంగా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలకు అప్పగించారు. విలేకరుల సమావేశానికి ముందు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలాలు, పట్టణాల వారీగా పట్టభద్రుల వివరాలను సేకరించి ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. డాక్టర్లు, న్యాయవాదులు, ఉద్యోగులు, యువత, రైతులు తదితర వర్గాల పట్టభద్రులను పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించేందుకు కార్యాచరణ రూపొందించారు. అంతకుముందు ప్రకాశం స్టేడియంలో బీఆర్ఎస్ నేతలు పట్టభద్రులను కలిసి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఏనుగుల రాకేష్‌రెడ్డి ఓటమి తర్వాత కూడా ప్రజల్లోనే ఉంటూ యువత, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్నారని నేతలు పేర్కొన్నారు. ఈసారి అభ్యర్థి గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. రైతులు యూరియా, విద్యుత్, సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కొరత ఉందని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలుపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ రావాలి.. రేవంత్‌రెడ్డి పోవాలి.. బీఆర్ఎస్ రావాలి.. కాంగ్రెస్ పోవాల్సి అనే నినాదం ప్రజల్లో బలంగా ఉందని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో కేసీఆర్ పాటలకు ప్రజల నుంచి వచ్చిన స్పందన ఇందుకు నిదర్శనమని అన్నారు. భద్రాచలం రామాలయ అభివృద్ధి పనులపై కూడా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆలయ అభివృద్ధికి కేటాయించిన నిధులు, జరుగుతున్న పనులు, వాటి నమూనా, కాంట్రాక్టర్ వివరాలను ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ భద్రాచలం అభివృద్ధిలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని విమర్శించారు. యాదాద్రి ఆలయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన తీరును ప్రస్తావిస్తూ భద్రాచలం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ప్రశ్నించారు. వారం రోజుల్లో ముగ్గురు మంత్రులకు సంబంధించిన మరిన్ని అంశాలను వెల్లడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, భానోత్ హరిప్రియ నాయక్, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, ఏనుగుల రాకేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం కృషిచేయాలి: డీఈవో వాసంతి



**కొణిజర్ల అక్టోబర్ 06 ప్రభాత వార్త:**

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, రాబోయే పది పరీక్షల్లో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు, కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పెద్దమునగాల , కొణిజర్ల హై స్కూల్లలో జరుగుతున్న 9వ తరగతి స్పాట్ వాల్యూషన్ ను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఫౌండేషన్ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని హెచ్ఎం లకు సూచించారు. విద్యార్థులకు అభ్యాసన బోధన పురోగతి ఎదురవుతున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు విద్యార్థులకు చదవడం రాయడం గణిత నైపుణ్యాల పెంపుపై పలు సూచనలు చేసినారు. పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు అవసరమైన గ్రాంట్ ప్రభుత్వం నుండి మంజూరైందని నవంబర్ నుంచి పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది ప్రభుత్వ పాఠశాలలో 85 ఉత్తీర్ణత సాధించారని ఈ ఏడాది 95 సాధించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అబ్రహం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారి ,పాల్గొన్నారు.

# స్థల దాత కుటుంబానికి ఆయా పోస్ట్ ఇవ్వాలి

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 6)**



దుమ్ముగూడెం మండలం మంగువాయిబాడవ గ్రామంలో రెండు ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఉచితంగా స్థలం ఇచ్చిన కుటుంబానికి గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయా పోస్ట్ ను కేటాయించాలంటూ ఆ కుటుంబం ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంది వివరాల్లోకెళ్తే మంగువాయిబాడువా గ్రామానికి చెందిన బొర్ర కాంతమ్మ అనే మహిళ 2016 సంవత్సరంలో గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం అంగనవాడి కేంద్రం భవన నిర్మాణాలకు ఉచితంగా స్థలాన్ని ఇచ్చింది ఆ క్రమంలో అప్పటి పెస గ్రామసభ ఉన్నతాధికారుల సమక్షంలో భవిష్యత్తులో ఆ ప్రభుత్వ భవనాలలో ఏదైనా ఖాళీగా ఉన్న పోస్టును స్థలం ఇచ్చిన కుటుంబానికి కేటాయిస్తామంటూ ఆ కుటుంబానికి భరోసా కల్పించారు గ్రామసభలో కూడా పెద్దలు తీర్మానించారు ఇదిలా ఉండగా భర్తను కోల్పోయి కూలీ నాలి పనులు చేసుకుంటూ పిల్లల్ని పోషించుకుంటూ చదివించుకున్న బుర్రా కాంతమ్మ తమ కుటుంబ సభ్యుల్లోని ముగ్గురు కుమార్తెల్లో ఒకరికైనా అంగన్వాడి ఆయ పోస్టును ఇప్పించాలని ఐటీడీఏ పీవో జిల్లా కలెక్టర్ భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకటరావుకు వినతి పత్రాలు సమర్పించారు కానీ అన్ని అర్హతలు ఉన్న స్థలాన్ని ఉచితంగా ప్రభుత్వ భవనాలకు ఇచ్చినా తమ కుమార్తెల పేరును సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థలం ఇచ్చినప్పుడు ఐసిడిఎస్ అధికారులు తమ కుటుంబానికి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేస్తుంది జిల్లా ఉన్నతాధికారులు తన కుటుంబంలో ఒక కుమార్తెకు అంగన్వాడి ఆయా పోస్టును కేటాయించి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేస్తుంది

## నేరాలు-దారుణాలు

### ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి



**కామేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :**

కామేపల్లి మండలం బర్లగూడెం, గోవింద్రాల తదితర గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, పంపిణీ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పర్యవేక్షించారు. పలు సూచనలు డీలర్లకు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజి స్ట్రీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు . డిజిల్ క్రాప్ బుకింగ్ ప్రక్రి యను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని డిజిటల్ బుకింగ్ సర్వేయర్లను కూడా ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఏవో బి.తారా దేవి, ఏ ఈ ఓ లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### స్త్రీ శక్తి భవన్ నిర్మాణానికి శంకుస్థాపన



**వైరా టౌన్ అక్టోబర్ 6 (ప్రభాతవార్త)**

తాటిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో స్త్రీ శక్తి భవన్ (వీవో బిల్డింగ్) నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి జవాజి అశ్విని నాగరాజు, ఉపసర్పంచ్ ఇస్మాయిల్ భూమిపూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖ ఏఈ, డీఈలు హాజరై భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. మహిళా సంఘాలకు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడేలా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు సభ్యుడు పెడియాల లక్ష్మయ్య, 10వ వార్డు సభ్యుడు సయ్యద్ ఉమర్ సాహెబ్, గ్రామ పెద్దలు తాత నిర్మల, మాజీ సర్పంచ్ బండి కోటయ్య, దోసపాటి సర్వేశ్వరరావు, దుగ్గిరాల చిన్న వెంకులు, దుగ్గిరాల భాస్కర్, ఉయ్యాల నాగరాజు. గ్రామ దీపిక తేజశ్రీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, జింకలగూడెం గ్రామానికి చెందిన ఎస్కే మహమ్మద్ మీరా, ఎస్కే జాన్ మియా, ఎస్కే అల్లా, పెడియాల కృష్ణ, తిరపయ్య, మల్టీపర్పస్ వర్కర్లు బండి వీరయ్య, కొండపల్లి నరసింహారావు, పొదిల వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ గుమ్మా రోశయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై పోలీస్‌ల దాడి

**అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**

అశ్వారావుపేట మండలంలోని నారం వారి గూడెం కాలనీ గ్రామ శివారులో చెరువు దగ్గర గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు ఎసఐ యయాతి రాజు తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.8100 నగదు, 4 మోటార్ సైకిల్ లు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసఐ తెలిపారు.




# గిరిజన మహిళలు, రైతులకు ఆర్థిక చేయూత

**విద్యార్థుల బలోపేతానికి**

**ప్రత్యేక ప్రణాళికలు**

**భద్రాచలం, అక్టోబర్ 6(ప్రభాతవార్త):**

గిరిజన సంక్షేమంతో పాటు మహిళలు, రైతులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ఐటీడీఏ ప్రత్యేక చర్యలు చేపడుతోందని పీవో బి.రాహుల్ తెలిపారు. ఐఐఎఫ్ఎం బృందం సభ్యులతో మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో సమావేశమై ఐటీడీఏ ఆధ్వర్యంలోని కార్యక్రమాలను వివరించారు. మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేశామన్నారు. మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీ, చాక్లెట్లు,



ఇప్పనూనె, అటవీ, సేంద్రియ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నామని, యువతకు ఉపాధి కోసం పెట్రోల్ పంపులు ఏర్పాటు చేశామని చెప్పారు. గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉద్దీపకం వర్క్‌బుక్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గురుకుల విద్యార్థుల్లో 15 మంది ఐఐటీ, 25 మంది నీట్, 8 మంది ఎంబీబీఎస్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు గిరిజన మ్యూజియం, ఇలవేల్పుల గ్రంథం రూపొందించినట్లు వెల్లడించారు. గిరిజన గ్రామాల్లో స్వయం ఉపాధి పొందుతున్న మహిళల ఉత్పత్తులను గుర్తించి మరింత అభివృద్ధి చేసేందుకు ఐఐఎఫ్ఎం బృందం వివరాలు సేకరిస్తోందన్నారు. మారుమూల గిరిజన కుటుంబాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని పీవో రాహుల్ తెలిపారు.

## రోడ్డుపైకి వచ్చిన మొసలి పిల్ల కాపాడిన యువత

**అటవీ అధికారులకు అప్పగింత**

**గోదావరిలో సురక్షితంగా విడుదల**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**



బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మంగళవారం మొసలి పిల్ల రోడ్డుపైకి రావడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ప్రధాన రహదారిపైకి వచ్చిన మొసలి పిల్లను గమనించిన యువకులు వెంటనే స్పందించి, వాహనాల రాకపోకల మధ్య ప్రమాదం జరగకుండా దానిని సురక్షి తంగా పట్టుకున్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సారపాక డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ డి. కృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మొసలి పిల్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని గోదావరి నదిలో సురక్షి తంగా వదిలిపెట్టారు. మొసలి పిల్లను కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించిన యువకులు బబ్బు, రాయుడు, వారి బృందాన్ని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ డి. కృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు ఎక్కడైనా కనిపిస్తే వాటికి హాని కలిగించకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సారపాక ఎఫ్‌బీఓ జి. బాబురావు, సందెల్లపాడు ఎఫ్‌బీఓ బి. భీమ్‌చందర్, కృష్ణసాగర్ ఎఫ్‌బీఓ బి. ఉపేందర్ పాల్గొన్నారు.

## హాస్టల్ వార్డెన్ పై చర్యలు చేపట్టాలి

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 6)**



దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ఎస్టి బాలుర వసతి గృహానికి చెందిన వార్డెన్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సోంది మల్లుదొర డిమాండ్ చేశారు ఇటీవల వసతి గృహానికి చెందిన విద్యార్థులను వార్డెన్ కొడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తడంతో మంగళవారం ఆదివాసి సంఘ నాయకులు వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు ఈ సందర్భంగా మల్లుదొర మాట్లాడుతూ వసతి గృహానికి చెందిన వార్డెన్ అకారణంగా పిల్లలను కొడుతున్నాడని తక్షణమే అతన్ని బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. కుర్సం సీతయ్య రాజేష్ వెంకటేష్ పాల్గొన్నారు

## పుష్కర ఘాట్ ఏర్పాటుపై ఇరిగేషన్ అధికారులు పరిశీలన

**దుమ్ముగూడెం :ప్రభాతవార్త (అక్టోబర్ 6)**

దుమ్ముగూడెం గ్రామం వద్ద గోదావరి ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలపై ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు వచ్చే గోదావరి పుష్కరాల కోసం దుమ్ముగూడెం గ్రామంలోని గోదావరి నది ఒడ్డున పుష్కరఘాట్ నిర్మించాలని భక్తులు పరిసర ప్రాంతాల ప్రజల విజ్ఞప్తి మేరకు గతంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు దుమ్ముగూడెం గ్రామం వచ్చి గోదావరి పరిసర ప్రాంతాలను పరిశీలించారు నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు ఇదిలా ఉండగా భద్రాచలం ఇరిగేషన్ శాఖకు చెందిన ఈ ఈ సయ్యద్ జానీఅహ్మద్ మంగళవారం సాయంత్రం దుమ్ముగూడెం సందర్శించి గోదావరి నది ఒడ్డున పరిసర ప్రాంతాలను పరిశీలించారు గోదావరి ఒడ్డున పుష్కర ఘాట్ల నిర్మాణానికి సంబంధించి సాధ్యసాధ్యాలను పరిశీలించారు డి ఈ భాగ్యరాజ్ రాథోడ్ ఏ ఈ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణంలో మార్పులు పశువులపై ప్రభావం

**పశువైద్య శిబిరంలో రైతులకు సూచనలు**

**దుమ్ముగూడెం :ప్రభాతవార్త (అక్టోబర్ 6)**



వాతావరణంలో మార్పులు అట్టి మార్పులతో పశువుల్లో కలిగే ప్రభావాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై పశు వైద్య శిబిరంలో రైతులకు అవగాహన కల్పించారు దుమ్ముగూడెం మండలంలోని చిన్న బండి రేవు గ్రామంలోపశువైద్య పశుసంవర్ధక శాఖ డి.ఎల్.డి.ఏ వైరా వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధుల పశు వైద్య శిబిరం నిర్వహించారుఈ పశు వైద్య శిబిరంలో 65 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించారు నట్టల నివారణ మందులు పలు రకాల వ్యాధులకు చికిత్సలు చేశారు ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు డాక్టర్ ఎన్ లిఖిత డాక్టర్ కె సుధారాణి లు పశువుల పెంపకం తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా గ్రామంలోని పాడి పశువులను పరీక్షి ంచి పునరావృతంగా గర్భం దాల్చకపోవడం ఈదులోకి రాకపోవడం గర్భాశయ సంబంధిత సమస్యలు తదితర కేసులను గుర్తించి అవసరమైన చికిత్స అందించారు ఈ శిబిరం ద్వారా పశువుల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావం నుండి పశువులను కాపాడేందుకు పశుపోషకులకు అవసరమైన సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ స్థానిక సర్పంచ్ జోగయ్య జకరయ్య గోపాలమిత్రాలు రాంబాబు నరేష్ పలువురు రైతులు పాల్గొన్నారు

## అంగన్వాడి కేంద్రం తనిఖీ

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 6)**

దుమ్ముగూడెం మండల పరిధిలోని కోయ నర్సాపురం గ్రామంలోని ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని దుమ్ముగూడెం తహసిల్దార్ మామిడి అశోక్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు పిల్లలకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని వంటకు వినియోగించే వస్తువులు ఎత్తైన ప్రదేశంలో పెట్టాలని సూచించారు త్రాగునీరు టాయిలెట్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు అలాగే గ్రామ పంచాయతీలోని వివో భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు మండలంలో ప్రభుత్వ భూమిని గుర్తించి వివో భవన నిర్మాణాలకు కేటాయిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించాలి

**ఆశా డే సమావేశంలో**

**డిఎంహెచ్ తుకారం రాథోడ్**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**

గ్రామాల్లో క్రమం తప్పకుండా ఇంటింటికి తిరిగి ప్రజలు ఆరోగ్యం పై అవగాహన కల్పించేలా వైద్యశాఖ సిబ్బంది ఆశా వర్కర్లు పనిచేయాలని జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మొరంపల్లి బంజరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల పెరుగుదలను గుర్తించి వెంటనే అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. వైద్యశాఖ, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ ఇంటి యజమానిని కలుపుకొని వారి ఇంట్లో ఎలాంటి నిల్వ నీళ్లు లేకుండా ఉంచుకునేందుకు సూచించాలని దోమలు పెరిగి లార్వా నిల్వ



లేకుండా జాగ్రత్త పడాలని ఇంటిలో ఇంటి బయట పరిశుభ్రమైన వాతావరణం ఎప్పటికప్పుడు ఉండే విధంగా చరోచూపాలని పలు సూచనలు ఇవ్వాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలతో ప్రజల్లో భయం లేకుండా ప్రభుత్వ వైద్యంతో తగ్గుతుందని రోగులకు సూచనలు అందించాలన్నారు. ఆశ వర్కర్లు తమ తమ గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య విషయాలను పర్యవేక్షి స్తూ రికార్డులను తయారు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హాస్టల్లో క్యాంపులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. క్యాంపు నిర్వహించేటప్పుడు ఒక రిజిస్టర్ను మెయింటినెన్స్ చేయాలని సూచించారు. మంచి సేవలు అందించిన వారిని అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి రిజిస్టర్, ల్యాబ్ రూమ్, మెడిసిన్ స్టోర్ రూమ్, ఇన్ పేషెంట్ల రూమ్ మీటింగ్ హాల్, ప్రజలకు డ్రింకింగ్ వాటర్, టాయిలెట్ వంటి సౌకర్యాలు ప్రత్యేకించి పర్యవేక్షి ంచి అభినందించారు. స్టాఫ్ నర్స్ లను డెలివరీ చేసే విధంగా కోచింగ్ కి పంపిస్తామని తెలిపారు. అదేవిధంగా నైట్ వాచ్మెన్ (సెక్యూరిటీ గార్డ్) ను ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ విజయలక్ష్మి , హెచ్ఈఓ లు వెంకట నరసమ్మ, రమణ, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల గురుకులంలో ఎలుకల స్వైర వ్యవహారంపై జెసికి వినతి

**ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే 10 మంది**

**విద్యార్థినీలను గాయపరచిన ఎలుకలు**




**ఖమ్మం విద్యా విభాగం అక్టోబర్ 6 ప్రభాత వార్త:** నేలకొండపల్లి బాలికల సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం పదిమంది విద్యార్థినీలను ఎలుకలు కరిచి గాయపరిచాయని నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ పై తక్షణమే చర్య తీసుకోవాలని పి.డి.యస్.యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పిడిఎస్ యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి కి నేలకొండపల్లి బాలికల సాంఘిక సంక్షేమం గురుకులం ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యు నాయకులు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిప్పారపు లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థినీలు చదువుకునే వసతి గృహాలలో సరియైన శుభ్రత చర్యలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో డార్మెంటు గదులలో ఎలుకలు,పాములు, కోతులు ప్రవేశించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నా రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రిన్సిపాల్ ఎలాంటి పట్టింపు లేకుండా వ్యవహరించడంతో విద్యార్థులకు ప్రాణాంతక పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రిన్సిపాల్ తన ఇష్టానుసారంగా వ్యవహరించిన పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు నామమాత్రంగా చూసి చూడనట్లుగా ఉండడంతో గురుకులాలలో పనిచేసే ప్రిన్సిపాల్స్ విద్యార్థుల యోగక్షేమాలను సైతం మరిచి కాలక్షేపంగా ఉంటున్నారని అన్నారు. అందులో భాగంగానే నేలకొండపల్లి గురుకులంలో విద్యార్థినీలపై ఎలుకలు స్వైర విహారంగా ఉంటూ విద్యార్థినీలను గాయపరిచాయని తక్షణమే ఎలుకలు,కోతులు, పాములను రానీయకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో పిడిఎస్ ఖమ్మం జిల్లా యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘు తో పాటు ఖమ్మం జిల్లా నాయకులు త్రినాథ్,కార్తీక్ రెడ్డి,గణేష్ తదితరులు పాల్గొన్నారు..




## ప్రాణ సంకటంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫారం

**ఎన్నడు ఏ ఆపద వస్తుందని బాటసారుల భయం భయం**

**నిత్యం స్కూలు పిల్లల బస్సులు రాకపోకలు ట్రాన్స్ఫారం మార్చాలని ప్రజలు విన్నపాలు**

**ఖమ్మం అర్బన్, అక్టోబర్ 6(ప్రభాత వార్త )**



ఖమ్మం కార్పొరేషన్ 4 వ డివిజన్ బాలాజీ నగర్ లో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ఫారం ప్రజలకు ప్రాణ సంఘటనగా మారింది. ప్రతినిత్యం అటు వాహనదారులు రాకపోకల తో పాటు స్కూలు పిల్లల బస్సులతో రద్దీగా ఉండడంతో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్ఫారంతో ఏ ఆపద వస్తుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అభివృద్ధి పేరుతో సైడ్ డ్రైనేజీలు నిర్మహించిన నిర్వాహకులు కనీసం ట్రాన్స్ఫారం పక్కనున్న స్తంభానికి అమర్చి ఉన్న ఫీజు బాక్సు వలన ఏదో ఒక సందర్భంలో ప్రమాదం పొంచి ఉన్న సంగతి మరిచారని వాహదారులు వాపోతున్నారు. ఈ మధ్యకాలంలో రెండు మూడు ప్రమాదాలు సంభవించాయని అదృష్టవశాత్తు ఆ సమయంలో విద్యుత్తు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అక్కడున్న ప్రజలు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ఫర్మర్ వలన ప్రమాదం సంభవించకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజల కోరుకుంటున్నారు.

# భద్రాచలం నుంచి తిరుమల కొండపైకి చేరిన మహాపాదయాత్ర



**ఖమ్మం విద్యా విభాగం అక్టోబర్ 6, ప్రభాత వార్త:** భద్రాచలం నుంచి తిరుమల శ్రీవారి సన్నిధి వరకు సాగిన ఎనిమిదవ మహాపాదయాత్ర.ఎన్నో రోజులుగా సాగిన ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో ప్రతి అడుగు ఒక సంకల్పం.. ప్రతి అడుగులో ఒక ప్రార్థన.. ప్రతి అడుగులోనూ "గోవిందా.. గోవిందా.." అనే నామస్మరణే శ్వాసగా మారింది. త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు బృందంఅలసటను లెక్కచేయకుండా, కాళ్లకు వచ్చిన బాధను మరచి,మనసులో శ్రీవారిని నిలుపుకుని.. పెదవులపై గోవింద నామాన్ని పలుకుతూ.. అడుగు అడుగుగా తిరుమల కొండను అధిరోహించిన మహాపాదయాత్ర బృందం చివరకు పవిత్రమైన బేడి ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుంది.అక్కడ భక్తిశ్రద్ధలతో బేడి ఆంజనేయస్వామివారిని దర్శించుకుని, కొబ్బరికాయ సమర్పించి, హారతి ఇచ్చి ఆ క్షణం..ఎన్నో రోజుల పాదయాత్రకు ఒక పవిత్రమైన మైలురాయిగా నిలిచిపోయింది. భద్రాచలం నుంచి మొదలైన అడుగులు.. తిరుమల కొండపైకి చేరాయి.నడిచిన ప్రతి అడుగు స్వామివారికే అంకితం..పలికిన ప్రతి నామం స్వామివారికే సమర్పితం..చేసిన ప్రతి ప్రార్థన స్వామివారి దివ్య దర్శనం కోసమే!ఇక ఈ మహా పాదయాత్రలో మిగిలింది ఒక్కటే..ఆ ఏడుకొండల వాడి దివ్య మంగళ స్వరూపాన్ని కళ్లారా దర్శించుకోవడం!ఆ క్షణం కోసం మనసు పరితపిస్తోంది..ఆ దివ్య దర్శనం కోసం హృదయం ఉవ్విళ్లూరుతోంది."ఎప్పుడు ఆ శ్రీవారి సన్నిధిలో నిలబడతామా..ఎప్పుడు ఆ దివ్య మంగళ స్వరూపాన్ని కళ్లారా చూస్తామా.."అనే ఆత్రుతతో ప్రతి హృదయం ఎదురుచూస్తోంది.ఇన్ని రోజుల పాదయాత్రకు పరమార్థం..ఇన్ని అడుగులకు గమ్యం..ఇన్ని ప్రార్థనలకు ఫలితం..ఆ శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనమే! అడుగులు ముగిశాయి.. నామస్మరణ కొనసాగుతోంది.. పాదయాత్ర గమ్యాన్ని చేరింది.. కానీ భక్తుల హృదయాల ప్రయాణం మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది..

## ఖమ్మం వన్ టౌన్,రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లుగా బాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్లు

**ఖమ్మం క్రైమ్, (ప్రభాతవార్త.ఖమ్మం వన్ టౌన్,**



రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్లు ఎండి. సాధిక్ పాషా, టి.కరుణాకర్ .బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

# ఏడు సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు

**జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య**

**ఖమ్మం వ్యవసాయం అక్టోబర్ 6: ( ప్రభాత వార్త)**



వానాకాలం 202627 ధాన్యం కొనుగోలు సీజన్ అక్టోబర్ 2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూడనున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందింస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించవచ్చున్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# డంపింగ్ యార్డులో బోల్తాపడిన డంపర్

**డ్రైవర్‌కు గాయాలు..**

**రహదారి నిర్మాణంపై కార్మికుల అనుమానాలు**

**రుద్రంపూర్ అక్టోబర్ 6 ప్రభాతవార్త:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వెంకటేశ్ గనిలో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది.



మొదటి షిఫ్ట్‌లో డంపింగ్ యార్డు ఆర్ఎల్-7/10 వద్ద మట్టి తరలిస్తున్న భారీ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. డంపింగ్ యార్డు వద్ద ఉన్న మూలమలుపును వేగంగా దాటే క్రమంలో వాహనం అదుపుతప్పినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం డ్రైవర్‌ను తొలుత రుద్రంపూర్ డిస్పెన్సరీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం యూనియన్ నాయకుల ఆందోళనతో సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. అయితే ప్రమాదానికి వాహనం నడిపిన డ్రైవర్‌కు అవసరమైన శిక్షణ, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉన్నాయా? అనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన ప్రాంతంలోని మూలమలుపు నిర్మాణం, రహదారి వెడల్పుపై డ్రైవర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సింగరేణి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా మలుపు లేకపోవడం, భారీ వాహనాల రాకపోకలకు సరిపడా వెడల్పు లేకపోవడం వల్లే వాహనం అదుపుతప్పినట్లు డ్రైవర్ పేర్కొన్నట్లు సమాచారం. ఇదే ప్రాంతంలో గత సెప్టెంబర్ 15న కూడా ప్రమాదం జరిగిన విషయాన్ని కార్మికులు గుర్తుచేస్తున్నారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో అసలు కారణాలను తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు. వాహనాలు తిరిగే ప్రాంతాల్లో రహదారి వెడల్పు, మూలమలుపుల నిర్మాణం, రహదారి పరిస్థితి, భద్రతా ప్రమాణాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## తులసి 7 పత్తి పై క్షేత్ర ప్రదర్శన

**ఖమ్మం వ్యవసాయం అక్టోబర్ 6: (ప్రభాతవార్త)**




మంగళవారం తులసి సీడ్స్ గుంటూరు వారి ఆధ్వర్యంలో జూలూరుపాడు మండలం కరివారిగూడెం గ్రామంలో గుగులోత్ శంకర్ పొలంలో తులసి 7 పత్తి పై రైతు పొలంలో క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనకు జూలూరుపాడు, చంద్రుగొండ, సుజాతనగర్ మండలాలోని 15 గ్రామాల నుండి పత్తి రైతులు వచ్చి పత్తి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఉద్దేశించి కంపెనీ ఏరియా మేనేజర్ టి. రమేష్ మాట్లాడుతూ తులసి 7 పత్తి రకం గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో పత్తి రైతులు సాగు చేస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్నారని, అలాగే కాయ సైజు పెద్దగా ఉండి, పత్తి కాటాకు వస్తుందని తెలియజేశారు. తులసి 7 పత్తి ప్రతి చెట్టుకి 90 నుంచి, 100 కాయలు కాసాయని దోమ, పురుగు, చీడపీడలు దినికి తక్కువగా వస్తాయని ఇది అన్ని నెలల్లో, అందరు సాగు చేసుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పత్తి పంట బాగా సాగు చేసిన రైతు గుగులోతు శంకర్ కి గౌరవప్రదంగా సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో తులసి సీడ్స్ ఏరియా మేనేజర్ టి. రమేష్, నరేష్, వీరన్న, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ వైద్యశాలను అప్‌గ్రేడ్ చేయాలి

**వైద్యుల కొరత తీర్చాలి**

**రక్షణ సేన డిమాండ్**

**ఆస్పత్రికి మహర్దశ కల్పించాలి30**

**పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి**

**తెలంగాణ రక్షణ సేన డిమాండ్**



**ఆళ్లపల్లి,06 అక్టోబర్ ప్రభాతవార్త:**

గిరిజన ప్రాంతమైన ఆళ్లపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ జిల్లా నాయకులు ముసల రామకృష్ణ, వాంకుడోత్ రవి ఆధ్వర్యంలో నాయకులు వైద్యశాలను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని పేద, గిరిజన ప్రజలు వైద్యం కోసం ఈ ఒక్క ఆస్పత్రిపైనే ఆధారపడుతున్నారని, అయితే ఇక్కడ వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఒక మహిళా వైద్య నిపుణురాలు (గైనకాలజిస్ట్) తో కలిపి ముగ్గురు డాక్టర్లను నియమించాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఇద్దరు స్టాఫ్ నర్స్, ఇద్దరు మేల్ నర్సింగ్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తేనే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లను పట్టించుకోకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వారి వెంట మండల నాయకులు సర్వేశ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## విజేతలుగా ట్రైబల్ వెల్ఫేర్ కబడ్డీ క్రీడాకారిణులు

**విజేత జట్టుకు బహుమతి ప్రధానం చేసిన**

**మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

**క్రీడాకారులను అభినందించిన గిరిజన**

**సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ చైతన్య**

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 06(ప్రభాతవార్త):**



తెలంగాణ రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ క్రీడోత్సవంలో అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల క్రీడాకారిణులు కొర్స అలేఖ్య. పర్సిక దీవెన విజేతలుగా నిలిచారు. వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో భద్రాద్రికొత్తగూడెం జిల్లా కబడ్డీ సబ్ జూనియర్ బాలికల జట్టు పాల్గొని. కబడ్డీ ఫైనల్స్లో ప్రథమ స్థానాన్ని సోమవారం కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన జట్టుకు తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ బహుమతిని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడాకారిణులు కొర్స అలేఖ్య పర్సిక దీవెన లను గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ చైతన్య, పిఈటి మొగిలి వెంకటమ్మ, కళాశాల అధ్యాపకులు. సిబ్బంది పలువురు అభినందించారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతిపత్రం**

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, ఐఏఎస్‌ను భద్రాచలంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. అలాగే నూతనంగా ఏర్పాటైన భద్రాచలం మండల పరిషత్ కార్యాలయానికి అవసరమైన మినిస్టీరియల్ సిబ్బందిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, స్టేట్ కౌన్సిలర్ వెల్ది ప్రసాద్, జిల్లా బాధ్యులు శ్రావణి కృష్ణ, అంబిక తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్య కార్మికులను ఇబ్బందిపెట్టొద్దు

**మెడికల్ అటెండెన్స్ నిబంధనలు మార్చాలి:**

**ఎఐటీయూసీ**

**రుద్రంపూర్ అక్టోబర్ 6 ప్రభాతవార్త:**



సింగరేణిలో అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులను గతంలో మాదిరిగా ఇన్వాలిడేషన్ చేసి, వారి డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డుకు హాజరయ్యేందుకు కార్మికులు భయపడుతున్నారని, అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్' అంటూ పంపిస్తున్నారనే ఆందోళన ఉందన్నారు. తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారిని బోర్డు చుట్టూ తిప్పకుండా, గతంలో మాదిరిగా ఏరియా ఆసుపత్రుల వైద్యుల కమిటీ ద్వారా పరీక్షలు నిర్వహించి ఇన్వాలిడేషన్ చేయాలని కోరారు. 1981లో వారసత్వ ఉద్యోగాల కల్పనపై కుదిరిన ఒప్పంద స్ఫూర్తిని కొనసాగించాలని, మెడికల్ అటెండెన్స్ నిబంధనలను పారదర్శకంగా మార్చి కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించాలని రంగయ్య డిమాండ్ చేశారు.

## వీకే ఓసీపీకి కొత్త ఊపునూతన పీఓ జి.శంకర్‌కు ఏఐటీయూసీ ఘన సన్మానం

**రుద్రంపూర్ అక్టోబర్ 6 ప్రభాతవార్త:**

కొత్తగూడెం ఏరియాలో కీలకమైన వీకే సీఎం ఉపరితల గనికి నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా జి.శంకర్ బాధ్యతలు స్వీకరించడంతో ప్రాజెక్టు పనుల్లో వేగం పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన పీఓను ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ నాయకులు పీఓను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వీకే సీఎం ఓసీపీకి గత కొంతకాలంగా ఎదురవుతున్న సాంకేతిక, కార్మిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్పత్తి, భద్రతను సమన్వయం చేయాలని కోరారు. ముఖ్యంగా మ్యాన్‌పవర్ కొరత, యంత్రాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, కార్మిక సంక్షేమంపై చర్యలు తీసుకోవాలని బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య విజ్ఞప్తి చేశారు. కార్మికులు, యాజమాన్యం మధ్య సమన్వయానికి ఏఐటీయూసీ సహకరిస్తుందని నాయకులు తెలిపారు. కార్మికుల సహకారంతో వీకే సీఎం ప్రాజెక్టును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నూతన పీఓ జి.శంకర్ హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఆఫీస్ బేరర్ హీరాలాల్, పిట్ కార్యదర్శులు కోటి, శ్రీనివాస్ (కమల్), సీనియర్ నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, ఓదెలు, శ్రీనివాస్, పాల్తేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## లంబాడీల హక్కులను దెబ్బతీస్తే సహించేది లేదు

**విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలి: సేవాలాల్ సేన**

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**



లంబాడీ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడీల ఎస్టీ హోదా రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం గిరిజన సమాజ ఐక్యతకు విఘాతం కలిగిస్తుందన్నారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించేలా, లంబాడీల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించే వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. లంబాడీ సమాజ హక్కులు, గౌరవాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో పోరాడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో కిరణ్ నాయక్, భరత్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు 36శాతం లాభాల వాటా

**వాస్తవ లాభాలు ప్రకటించి వెంటనే చెల్లించాలి**

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**

2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ఎలాంటి మినహాయింపులు లేకుండా ప్రకటించి కార్మికులకు 36శాతం లాభాల వాటా వెంటనే చెల్లించాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ తదితరులు కొత్తగూడెం ఏరియా జీఎం సీహెచ్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ జీకే సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



# మహిళా శిక్షణ కేంద్రానికి పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థల పరిశీలన

**సూచనలు చేసిన అదనపు కలెక్టర్ డా.శ్రీజ**

**స్థలాన్ని ముఖ్య కార్యాలయాలకు కేటాయించాలి**

**ప్రజలు రాజకీయపక్షాలు**

**మధిర అక్టోబర్ 6 ప్రభాతవార్త**

మధిర నియోజకవర్గ కేంద్రంలో మహిళలకు నైపుణ్యత కలిగిన వృత్తులలో శిక్షణ ఇచ్చేందుకుగాను డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శిక్షణ కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణకు గాను అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం మధిర లో పర్యటించారు. మెప్మా డి ఆర్ డి ఎ ల సంయుక్త ఆధ్వర్యంలో పదివేల మంది స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలతో పాటు ఆసక్తి కలిగిన మహిళలు యువతులకు వివిధ ఉపాధి రంగాలకు సంబంధించిన అంశాలలో నిష్ణాతులైన వారిచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఎరుపాలెం మండలంలో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ మేరకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి అవసరమైన నిధులను కూడా ఆయన విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ సూచనతో అదనపు కలెక్టర్ శ్రీజ మెప్మా పిడి నళిని పద్మావతి మధిర మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ పాల్ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రవికుమార్ మెప్మా ఎల్ఎంపి ఉపేంద్రమ్మ లతో కలిసి పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి శిక్షణ కేంద్రాన్ని నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పాత ఆస్పత్రిలో ఎన్ని కార్యాలయాలు ?ఇదిలా ఉండగా ప్రస్తుతం ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రి పాత భవనం లో ఇప్పటికే ప్రభుత్వ ఐటిఐ కళాశాల అధ్యాపక కార్యాలయ సిబ్బందికి



కేటాయించగా, ఇన్ పేషెంట్ వార్డులుగా ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆవరణలో అదనంగా నిర్మాణం చేపట్టిన కొన్ని గదులలో వైద్యశాఖ చెందిన పిపి యూనిట్ కొనసాగుతోంది. తాత్కాలిక ప్రాతిపదికను కొనసాగుతున్న ఈ కార్యాలయాలకు అదనంగా పట్టణంలో కొత్తగా మంజూరైన తాసిల్దార్ కార్యాలయం మున్సిపల్ కార్యాలయాల నిర్మాణాలకు త్వరలోనే పనులు ప్రారంభించే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న పాత ఆస్పత్రి భవనం రెవెన్యూ కార్యాలయానికి, మున్సిపల్ కార్యాలయానికి వినియోగించేందుకుగాను ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి అధికారులు మౌఖికంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ రెండు కార్యాలయాలు పట్టణానికి కీలకమైన శాఖలు కావడం ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ విభాగాలు కావడం గమనించాల్సిన అంశం. ఒకవేళ నూతన భవనాల నిర్మాణం చేపడితే తక్షణం తాసిల్దార్ మున్సిపల్ కార్యాలయాలు తాత్కాలికంగా కొనసాగేందుకు వీలుగా ఉన్న ప్రదేశం కట్టడం ఇదొక్కటే కావడం గమనించాల్సిన అంశం. ఐటిఐ కళాశాల అధ్యాపకులు సిబ్బంది కి పాలిటెక్నిక్ లో ఏర్పాట్లు తాసిల్దార్ కార్యాలయము మున్సిపల్ కార్యాలయాల ఏర్పాటు కు వీలుగా ప్రస్తుతం కేటాయించిన ఐటిఐ సెటప్ ను పాలిటెక్నిక్ కళాశాల తరలించి నిర్వహించాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు ఇచ్చిన సంగతి గమనించాల్సిన విషయం. ఐటిఐ ఈ విద్యా సంవత్సరంలో తరగతులు నిర్వహించట్లేనీ కారణంగా కేవలం అధ్యాపకులు సిబ్బంది మాత్రమే విధి నిర్వహణలో భాగంగా సమయానికి వచ్చి వెళుతున్న పరిస్థితి. మెప్మా శిక్షణకు ఐకెపి భవనం అనుకూలం మహిళా సాధికారత మహిళలకు స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక వృత్తి శిక్షణ ఇచ్చేందుకు పట్టణంలో నిర్మించి కొనసాగుతున్న ఐకెపి భవనం అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని మహిళా సంఘాల అభిప్రాయం. లక్ష్యం కోసం నిర్మించిన ఈ భవనం పదేళ్లుగా నిరాధారణకు లోనై ప్రస్తుతం తాత్కాలికంగా వసతి గృహానికి కేటాయించడం గమనించాల్సిన అంశం. జిల్లా కలెక్టర్ తో పాటు పర్యవేక్షణ అధికారులుగా ఉన్న ఉన్నతాధికారులు పట్టణంలో ప్రభుత్వ భవనాలు స్థలాలపై పూర్తిస్థాయి నివేదికలతో ప్రజలకు యోగ్యకరమైన రీతిలో తాత్కాలిక భవనాల కేటాయింపుకు స్థానిక అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో చర్చించి చర్యలు చేపట్టాలని రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ సదస్సుకు భారీగా తరలిన విద్యార్థులు..



**మధిర అక్టోబర్ 6 ప్రభాతవార్త**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సదస్సుకు మధిర మండలం నుండి విద్యార్థులు మంగళవారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈకార్యక్రమంలో మధిర మండల అధ్యక్షులు వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ మధిర మండల అధ్యక్షులు మేష పోగు ఇర్మియ మాదిగ,మండల ఇంచార్జ్ పార్శపు ఏనూక మాదిగ కో ఇన్చార్జ్ రాయవరపు దేవదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి దోర్నాల ఆంజనేయులు మాదిగ వివిధ గ్రామాల నుండి ఎం ఎస్ ఎఫ్ నాయకులు విద్యార్థులు, , యువకులు పాల్గొన్నారు.

## క్షణికావేశం మిగిల్చిన తీరని శోకం. కొండంత ఆశలను చితికెక్కిచ్చిందా.

**పాల్వంచ,అక్టోబర్ 06,ప్రభాత వార్త:**



తల్లిదండ్రులకు ఆరని గుండెకోత,ఎంతో ప్రేమతో, అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన కొడుకు చేతికొచ్చే సమయానికి దూరమైతే ఆ కడుపుకోత వర్ణనాతీతం. పిల్లల మనస్తత్వాన్ని, వారి భావాలను సరిగా అర్థం చేసుకోకపోతే,ఆ క్షణికావేశం కొండంత ఆశలను,కలలను బూడిద పాలు చేస్తుంది. పాండురంగపురం తండా గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన విషాద సంఘటన అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భూక్య కార్తీ అనే యువకుడు చిన్న మనస్పర్థల వల్ల మనస్తాపానికి గురై,ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాణంగా చూసుకున్న కొడుకు కళ్లముందే నూరేళ్ల జీవితాన్ని ముగించడంతో ఆ తల్లిదండ్రుల గుండెలు పగిలిపోయాయి.ఎంత రోదించినా,ఎంత కుమిలిపోయినా తిరిగిరాని లోకాలకు వెళ్లిన కొడుకుని తలుచుకుంటూ ఆ దంపతులు తీరని వేదన అనుభవిస్తున్నారు.ఎన్నో ఆశలతో పెంచుకున్న కొడుకు జ్ఞాపకాలు మాత్రమే మిగలడంతో,ఆ కుటుంబంలో ఆరని శోకం అలముకుంది.పిల్లల మనసును అర్థం చేసుకోకపోవడం, వారు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు తల్లి దండ్రుల జీవితాంతం కోలుకోలేని ఆవేదనను,తీరని లోటును మిగులుస్తాయని ఈ సంఘటన గుర్తుచేస్తోంది.

## కే హబ్ అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

**ఎడ్యుకేషన్ కేయు అక్టోబర్ 6 ప్రభాతవార్త :**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని కేహబ్‌లో టి జి ఇ డబ్ల్యు ఐ డి సి ఆధ్వర్యంలో, రూసా 2.0 నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షి ంచి, వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు పలు సూచనలు చేసినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. కేయూ కేహబ్ ద్వారా ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ తెలిపారు. కేహబ్, టి హబ్ హైదరాబాద్ మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, యువ ఔత్సాహికులకు మెంటరింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట రూసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, కేహబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న, అభివృద్ధి అధికారి ఆచార్య వై. వెంకయ్య తదితర అధికారులు ఉన్నారు.




## బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎ.ఎస్. డబ్ల్యూ .ఓ విద్యార్థినిలకు బ్లాంకెట్ల పంపిణీ



**బోనకల్, ప్రభాతవార్త:**

బోనకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని మధిర ఇంచార్జ్ అసిస్టెంట్ ఎస్ సి డి డి ఆఫీసర్ కొత్త వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలతో మమేకమై విద్యా ,వసతి గృహానికి సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన బ్లాంకెట్ లను విద్యార్థినీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి వినోద ,సిబ్బంది పాల్గొన్నారు

## కామేపల్లి వైద్యశాలను సందర్శించిన ఉప సర్పంచ్,



**కామేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :**

కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఉపసర్పంచ్ అజ్మీర నాగమణి రవి, వార్డు సభ్యులు ఏనూటి శ్రీను, అజ్మీర అఖిల్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పిచ్చికుక్క కాటు బాలుడికి అందిస్తున్న వైద్య సేవలు వివరాలను డాక్టర్ శ్రీదేవి, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వార్డులను కూడా పరిశీలించారు.రోగులకు అందిస్తున్న సేవల వివరాలను డాక్టర్ శ్రీదేవి వారికి వివరించారు.

## ఎమ్మెల్యే కోరం కనక య్యను కలిసిన శ్రీను

**కామేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :**



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ను మండల కేంద్రమైన కామేపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు ఏనూటి శ్రీను వ ం ం గ ౕ ళ ౕ ఎా ం ౕ ం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.కాలనీల్లో సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి నిధులు, ప్రధాన సెంటర్లలో డూమ్ లైట్లు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని శ్రీను ఎమ్మెల్యేను కోరారు.దీంతో ఎమ్మెల్యే స్పందించి సానుకూలతను వ్యక్తం చేసినట్లు శ్రీను తెలిపారు.

వార్త



# జీవో 76 దరఖాస్తులపై..
# కలెక్టర్ ఫోకస్





## పెండింగ్ కేసులు తేల్చండి..
## రికార్డుల ఆధారంగా పారదర్శక పరిశీలన

**కొత్తగూడెం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
జీవో నంబర్ 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. దరఖాస్తుల పరిశీలన, స్క్రూటినీ, రికమండేషన్, డిమాండ్ నోటీసుల జారీ, చెల్లింపులు తదితర అంశాలపై ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్యతో సమీక్షించారు. జిల్లాలో జీవో 76 కింద మొత్తం 4,031 దరఖాస్తులు ఉండగా, ఇప్పటివరకు 2,267 దరఖాస్తుల స్క్రూటినీ పూర్తయింది. మిగిలిన దరఖాస్తులపై విచారణ, రెవెన్యూ రికార్డుల పరిశీలన పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తు ప్రస్తుతం ఏ దశలో ఉందో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

**రికమండేషన్లపైనా మరోసారి పరిశీలన**

ఇప్పటికే రికమండ్ చేసిన దరఖాస్తులను కూడా సంబంధిత రికార్డుల ఆధారంగా మరోసారి పరిశీలించి అర్హతలను ధ్రువీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫస్ట్ ఫేజ్, సెకండ్ ఫేజ్‌లో జరిగిన ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించి.. అధికారులు చేపట్టిన విచారణ, చేసిన సిఫారసులకు ఆధారాలను నిర్ధారించాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు సుమారు 276 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. డిమాండ్ నోటీసులు జారీ చేసినవి, చెల్లింపులు చేసిన లబ్ధిదారులు, సేల్ ఆర్డర్లు పూర్తయినవి, పట్టాలు జారీ అయిన కేసులను వేర్వేరుగా గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు.

**కొత్తగూడెం, ఇల్లందుపై ప్రత్యేక దృష్టి**

కొత్తగూడెం, ఇల్లందు ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు ఎవరి వద్ద పెండింగ్‌లో ఉంది.. విచారణ పూర్తయిందా.. రికమండ్ చేశారా.. డిమాండ్ నోటీసు ఇచ్చారా.. చెల్లింపు జరిగిందా అనే అంశాలను ప్రతి కేసులో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. పాత, కొత్త దరఖాస్తులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించాలని, అర్హులైన దరఖాస్తుదారులకు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. పెండెన్సీని తగ్గించడంతో పాటు ప్రతి కేసుకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధీకరించాలని సూచించారు.

# పీఆర్ కమిషనర్ దివ్యకు ఘన స్వాగతం

## వినోబానగర్ వద్ద కాన్వాయ్ ఆపి
## గ్రామ పరిస్థితులపై ఆరా...

**జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబర్ 6**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముఖద్వారమైన జూలూరుపాడు మండలం వినోబానగర్ గ్రామ పంచాయతీ వద్ద తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఐఏఎస్‌కు మంగళవారం ఘన స్వాగతం లభించింది. భద్రాచలం అధికారిక పర్యటనకు వెళ్తున్న ఆమె కాన్వాయ్‌ను వినోబానగర్ వద్ద కొద్దిసేపు ఆపి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడారు. కమిషనర్ దివ్య కాన్వాయ్ వినోభానగర్‌కు చేరుకోగానే గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్‌తో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి 'వెల్‌కమ్ టు భద్రాద్రి కొత్తగూడెం' అంటూ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగావత్ నవీన్, అధికారులు గ్రామ పరిస్థితులను కమిషనర్‌కు వివరించారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,



ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పనుల పురోగతి, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, పారిశుధ్య చర్యలపై ఆమె ఆరా తీశారు. జిల్లాకు ముఖద్వారంగా ఉన్న వినోభానగర్ గ్రామపంచాయతీ పరిశుభ్రత, పచ్చదనం, అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా నిలవాలని కమిషనర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ నిధులను సక్రమంగా, పారదర్శకంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి అనూష, ఎంపీడీవో తాళ్లూరి రవి, ఎంపీవో తులసిరామ్, ఏపీవో రామారావు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలి

## నిబంధనలను కచ్చితంగా పాటించాలి
## ప్రజలకు మెరుగైన సేవలందించాలిపంచాయతీరాజ్ డిప్యూటీ కమీషనర్ జాన్ వెస్లీ



**జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబర్ 6:**
గ్రామ పంచాయతీల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలంగాణ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ సూచించారు. మంగళవారం జూలూరుపాడు ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం మండలంలోని వెంగన్నపాలెం, పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర అధికారిక దస్త్రాలను పరిశీలించి వాటి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది కార్యాలయ సమయపాలన పాటిస్తున్నారా? ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా? అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు సేకరించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపడుతున్న ఉపాధి హామీ పనులు, కూలీలకు పనుల కల్పన, పనుల పురోగతి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని డిప్యూటీ కమిషనర్ సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పారి శుధ్యం మెరుగుపడేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చూడాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయాల నిర్వహణలో నిబంధనలు, సమయపాలన, రికార్డుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. వెంట డిఆర్డిఏ పిడి విద్యాచందన, డిపిఓ అనూష, ఎండిఓ తాళ్లూరి రవి, ఎంపీవో తులసీరామ్, ఈజీఎస్ ఏపీవో రామారావు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

# నర్సాపురం..@కూరగాయల బ్రాండ్..!!

**జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబర్ 6:**
కూరగాయల సాగు అంటే.. నరసాపురం.. నరసాపురం అంటే.. కూరగాయల సాగు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పడమట నర్సాపురం గ్రామానికి కూరగాయల సాగుతో ప్రత్యేక గుర్తింపు ఉంది. నిన్న మొన్నటిది కాదు.. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఇక్కడి రైతులు కూరగాయలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. తరాలు మారినా.. సాగు పద్ధతులు మారినా.. కూరగాయలపై రైతుల మమకారం మాత్రం కొనసాగుతూనే ఉంది...

సొంత భూమి ఉన్న రైతులతో పాటు భూమిలేని వారు సైతం కూరగాయల సాగుపై ఆసక్తితో భూములను కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. కుటుంబమంతా పొలంలోనే శ్రమిస్తూ.. చెమట చిందిస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామ పరిధిలో సుమారు 150 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల సాగు జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

**అన్నిరకాల కూరగాయలకు నిలయం**

బెండ, బీర, వంగ, దోస, కాకర, చిక్కుడు, దొండ, మునగ, టమాటా తదితర అనేక రకాల కూరగాయలను నర్సాపురం రైతులు సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్, సీజన్, ధరలను అంచనా వేసుకుని పంటలను ఎంచుకోవడం ఇక్కడి రైతులకు అలవాటుగా మారింది. ముఖ్యంగా మేలైన హైబ్రిడ్ విత్తనాల ఎంపికకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అధిక ధర ఉన్నప్పటికీ నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో మంచి దిగుబడులు ఇస్తున్న వంగడాలను సైతం ఎంపిక చేసుకుని సాగు చేయడం ఇక్కడి రైతుల ప్రత్యేకత.

**అనుభవమే పెట్టుబడి.. శ్రమే బలం**

ఏళ్ల తరబడి కూరగాయలు సాగు చేస్తుండటంతో ఇక్కడి రైతులకు సాగుపై మంచి అనుభవం ఏర్పడింది. ఏ పంటను ఎప్పుడు వేయాలి.. ఏ విత్తనం ఎంచుకోవాలి.. ఎప్పుడు నీరు పెట్టాలి.. పంటకు ఏ సమయంలో ఏ జాగ్రత్తలు తీసుకోవాలి.. వంటి అంశాలను అనుభవంతో నేర్చుకున్నారు. విత్తనం నాటిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు, వారి కుటుంబ సభ్యులు అహర్నిశలు శ్రమిస్తారు. కలుపు తీయడం.. మందులు పిచికారీ చేయడం.. పంటను కాపాడటం.. కూరగాయలను కోయడం.. బస్తాల్లో నింపడం వరకు ప్రతి దశలోనూ కష్టం తప్పదు.

**పందిళ్లకూ పెరిగిన ఖర్చు**

దొండ, బీర, కాకర వంటి తీగజాతి కూరగాయల సాగుకు పందిళ్లు తప్పనిసరి. దీంతో ప్రతి సీజన్‌లో పందిళ్ల ఏర్పాటు రైతులకు అదనపు భారంగా మారుతోంది. పందిళ్లకు అవసరమైన వెదురు కోసం దూర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. వెదురు ధరతో పాటు కూలీల ఖర్చు కూడా పెరగడంతో పంట సాగు ప్రారంభించే ముందే పెట్టుబడి భారం పెరుగుతోందని రైతులు వాపోతున్నారు.





**ఏటా పెరుగుతున్న పెట్టుబడులు**

ఒకవైపు విత్తనాల ధరలు.. మరోవైపు ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు.. దీనికి తోడు పందిళ్లు, నీటి నిర్వహణ, రవాణా ఖర్చులు. ఇలా కూరగాయల సాగులో పెట్టుబడి ఏటా పెరుగుతూనే ఉందని రైతులు చెబుతున్నారు. పంటపై ఆశతో పెట్టుబడి పెట్టినా.. మార్కెట్‌లో ధర ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. మంచి ధర వస్తే పెట్టుబడి రాబట్టుకునే అవకాశం ఉంటుంది. ధర పడిపోతే మాత్రం చేసిన కష్టం మొత్తం నష్టంగా మారుతోంది.

**వాతావరణం.. చీడపీడలతో మరో పోరాటం**

కూరగాయల సాగులో వాతావరణ పరిస్థితులు కీలకం. వాతావరణం అనుకూలంగా లేకపోతే చీడపీడలు, తెగుళ్ల

**ఐదు దశాబ్దాలుగా చెమటోడ్చుతున్న రైతులు**
**ప్రతి ఏటా పెరుగుతున్న పెట్టుబడులు**
**ఒక్కోసారి ధర లేక ఆరుగాలం శ్రమ వృథా**
**మార్కెట్ లేక మిగులుతున్న నష్టాలు..!**

ఉధృతి పెరుగుతోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు రసాయన మందులను వినియోగించాల్సి వస్తోంది. దీంతో మందుల ఖర్చు పెరగడంతో పాటు పంట పెట్టుబడి మరింత భారమవుతోంది. ఒకవైపు ప్రకృతి సవాళ్లు.. మరోవైపు పెరుగుతున్న పెట్టుబడులు.. ఇంకోవైపు మార్కెట్ ధరల అనిశ్చితి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**పంట పండింది.. ధర మాత్రం లేదు**

అన్ని కష్టాలను అధిగమించి పంటను చేతికందించుకున్నా.. అసలు పరీక్ష మార్కెట్‌లోనే ఎదురవుతోంది. గ్రామంలోనే కూరగాయల విక్రయానికి సరైన మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రైతులు కొత్తగూడెం మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తోంది. పగలంతా కూలీలతో కూరగాయలను కోయించి, బస్తాల్లో నింపి సిద్ధం చేసుకుంటారు. తెల్లవారుజామునే ఆటోలు, ఇతర వాహనాల్లో కూరగాయలను కొత్తగూడెం మార్కెట్‌కు తరలిస్తారు. దీంతో రవాణా ఖర్చు అదనంగా భరించాల్సి వస్తోంది. కూలీల ఖర్చు, రవాణా ఖర్చు పోను మార్కెట్‌లో ఆశించిన ధర లభించకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.

**ధర లేక...శ్రమ వృథా**

మార్కెట్‌లో ధర పడిపోయినప్పుడు పంటను వెనక్కి తీసుకురాలేని పరిస్థితి. పంట పాడైపోయే ప్రమాదం ఉండటంతో ఎంత ధర వచ్చినా అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి పొలంలో చెమటోడ్చి.. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. చివరకు పంటకు గిట్టుబాటు ధర లభించకపోతే రైతు చేతిలో మిగిలేది నిరాశే. "పంట పండించడం మా చేతిలో ఉంది.. ధర నిర్ణయించడం మా చేతిలో లేదు" అన్నదే నర్సాపురం కూరగాయల రైతుల ఆవేదన.

**ఉద్యానశాఖ అండ ఏదీ..!?**

దశాబ్దాలుగా కూరగాయల సాగు చేస్తున్నప్పటికీ ఉద్యానశాఖ నుంచి క్షేత్రస్థాయిలో తగిన సూచనలు, సలహాలు అందడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, శాస్త్రీయ సాగు పద్ధతులు, తక్కువ ఖర్చుతో పందిళ్ల ఏర్పాటు, చీడపీడల నియంత్రణ,



మందుల వినియోగం, పంట అనంతర నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**నరసాపురానికి మార్కెట్... రైతులకు భరోసా**

సుమారు 150 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతున్న నేపథ్యంలో నర్సాపురం గ్రామాన్ని కూరగాయల సాగు కేంద్రంగా గుర్తించి ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. గ్రామానికి సమీపంలో కూరగాయల సేకరణ కేంద్రం లేదా మార్కెట్ సదుపాయం ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చు తగ్గడంతో పాటు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి కూడా తగ్గుతుందని అంటున్నారు. అలాగే రైతులకు శాస్త్రీయ సాగుపై శిక్షణ, ఉద్యానశాఖ సాంకేతిక సలహాలు, నాణ్యమైన విత్తనాలపై అవగాహన, చీడపీడల నియంత్రణకు మార్గదర్శకత్వం, పంటకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదు దశాబ్దాలుగా కూరగాయలనే జీవనాధారంగా చేసుకుని చెమటోడ్చుతున్న నర్సాపురం రైతులకు ప్రభుత్వం అండగా నిలిస్తే.. ఈ గ్రామం కూరగాయల సాగులో మరింత ప్రత్యేక గుర్తింపును సాధించే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.

# కొండ తవ్వకాలు!



## ఇంత పెద్ద గుట్ట కనబడలేదా..?
## పర్మిషన్ ఎవరిచ్చారు..?
## అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు - పరిశీలనకు వెళ్లిన ఆర్ఐ, తాత్కాలికంగా తవ్వకాలు నిలిపివేత

**పాల్వంచ, అక్టోబర్ 6,ప్రభాతవార్త**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామ పరిధిలో భారీగా కొండ తవ్వకాలు జరుగుతున్నాయనే విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. పెద్ద ఎత్తున గుట్టను తొలగిస్తున్నట్లు కనిపిస్తున్న దృశ్యాలు వెలుగులోకి రావడంతో ఈ తవ్వకాలకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ అధికారులు అనుమతి ఇచ్చారు? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించిందా? లేక ఇప్పటికే అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ వ్యవహారంపై వార్తా ప్రతినిధి సంబంధిత అధికారులను సంప్రదించగా తొలుత స్పష్టమైన సమాచారం అందకపోవడంతో సందేహాలు మరింత పెరిగాయి.

**ఎమ్మార్వో స్పందన**



పాండురంగాపురం కొండ ప్రాంతంలో ప్రస్తుతం తాము ఎలాంటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని పాల్వంచ ఎమ్మార్వో తెలిపారు. విషయాన్ని వెంటనే పరిశీలించి సంబంధిత రెవెన్యూ అధికారిని క్షేత్రస్థాయికి పంపిస్తున్నట్లు చెప్పారు.

**ఆర్ఐ వివరణ**

ఎమ్మార్వో ఆదేశాల మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) లెనిన్ కుమార్ మాట్లాడుతూ, గతంలో భగవాన్ దాస్ ఇచ్చిన అనుమతుల ఆధారంగా తవ్వకాలు జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారని అన్నారు. అయితే ప్రస్తుతం తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. సంబంధిత అనుమతి పత్రాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం రెవెన్యూ శాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాతే తదుపరి తవ్వకాలు చేపట్టాలని సూచించినట్లు వెల్లడించారు. స్థానికులు మాత్రం ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అనుమతుల చట్టబద్ధత, నిబంధనల అమలు, తవ్వకాల పరిమితి వంటి అంశాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆరేళ్లుగా తాత్కాలిక మార్కెట్‌లోనే రైతులు!

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుంది?

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి తాత్కాలిక రైతుబజార్‌కు తరలించి ఆరేళ్లు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని కొత్తగూడెం రైతుబజార్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2021 ఏప్రిల్‌లో వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం రైతుబజార్‌ను తాత్కాలిక ప్రదేశానికి



తరలించిన అధికారులు ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇప్పటికీ పనులు పూర్తికాకపోగా మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 130 మంది రైతులు, 16 డ్వాక్రా సంఘాల సభ్యులు కూరగాయలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. తాత్కాలిక మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎండ, వాన, చలిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. పైకప్పులు, రేకులు, కర్రలు ఎప్పుడు ఊడిపడి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై మార్కెటింగ్ శాఖ డీఎంఓతో పాటు మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదని రైతులు పేర్కొన్నారు. తమ కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించాలని కోరారు.

# ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్

**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 06:**

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 2.నుండి 31 వరకు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా మంగళవారం మణుగూరు ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యర్థాల సమర్థ నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా మణుగూరు ఏరియా అనుపత్తి మరియు జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఈవేస్ట్ సేకరణ కార్యక్రమాలను చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ పాల్గొని ఈవేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం కూడా పెరుగుతోందని, వాటి నుంచి వెలువడే ఈవేస్ట్ను బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉపయోగంలో లేని కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయాలని సూచించారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు, ఉద్యోగులు మరియు సిబ్బంది సమీకృత కృషి చేయాలని ఆయన కోరారు. ఈ

స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా మణుగూరు ఏరియాలోని కార్యాలయాలు,




ఆసుపత్రులు, ఇతర సంస్థల పరిధిలో ఉపయోగంలో లేని ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించి సేకరించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏరియా ఏరియా అధికారులు డి . వెంకట రామా రావు, హెచ్. రాం బాబు, ఎస్. రమేష్, జి. శివ ప్రసాద్, ఎం. జోష్నా , డాక్టర్ సురేష్, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ జానయ్య, జె. శ్రీనివాస రావు, పి. రమేష్, కె. శ్రీనివాస్ ఎస్. సురేష్, బి. శ్యామ్ ప్రసాద్, కె. శ్రీనివాస్ , వి. రామకృష్ణ రావు, ఇతర అధికారులు, ఏరియా అనుపత్తి చెందిన మైన్స్, మైనింగ్ సిబ్బంది, జీఎం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి: బి కే ఎం యు జిల్లా నాయకులు దండు...

**సత్తుపల్లి అక్టోబర్6 ప్రభాత వార్త**

ఎల్ నేనో ప్రభావంతో పంటలు సరిగా పండక కూలీలకు పనులు లేక ఇబ్బందులుపడుతున్నారని ఉపాధి హామీకూలీలందరకు పనులు కల్పించి రోజు కూలి ఆరు వందల రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలో మంగళవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని వారికి వెంటనే పనులు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గ్రామంలో చిన్న సన్న కారు రైతులు పేదలు ఉన్నారని మీరంతా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని వీరికి పనులుకల్పించేఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు యలమర్తి అలివేలు, మరియమ్మ, నల్లపాటి రాణి, ఎలమర్తి



కుమారి, ఎలమత్ సత్యవతి, ఎలమర్తి వెంకన్న, గోపాలకృష్ణ, రమణ, లక్ష్మీ, సుభద్ర, తులసి ,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల్లో సోషల్ ఆడిట్ తనిఖీలు ప్రారంభం..

**సత్తుపల్లి అక్టోబర్6 ప్రభాతవా ర్త**

సత్తుపల్లి మండలం లోని ఇరవై ఒక్క గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025 26ఆర్థికసంవత్సరమునకు 18 వ విడత సామాజిక తనిఖీ నిర్వహించుటకు గాను సోషల్ ఆడిట్ బృందం మంగళవారం నుంచిగ్రామపంచాయతీలలో సోషల్ ఆడిట్ కార్యక్రమమును ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో సిహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తేదీ నుండి మొదటి విడతగా రేగళ్లపాడు, రామ గోవిందపురం,యాతాలకుంట, నారాయణపురం, సదాశివుని పాలెం, బుగ్గపాడు, రామానగరం, రేజర్ల, రుద్రాక్ష పల్లి, సిద్ధారం, కిష్టాపురం, గంగారం,గ్రామపంచాయతీలలో సామాజిక తనిఖీ కార్యక్రమంప్రారంభించబడిందని తెలిపారు. ఈనెల14వ తేదీ వరకు అన్నిగ్రామపంచాయతీలలో సామాజిక తనిఖీ గ్రామ సభలను పూర్తిచేసి



అక్టోబర్ 15వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయము సత్తుపల్లి నందు ఓపెన్ ఫారం నిర్వహించబడునని ఎంపీడీవో సిహెచ్ నాగేశ్వరావుతెలియజేస్తున్నారు.

## గంగారంలో అంగన్వాడి కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం..

**.. సత్తుపల్లి అక్టోబర్ 6 ప్రభాతవార్త**

జిల్లా మహిళా అభివృద్ధి అధికారిని ప్రమీల ఆదేశాల మేరకు సత్తుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గంగారం సర్కిల్లో మంగళవారం ప్రాజెక్టు అధికారిని భవి రిశెట్టి సత్యవతి సూచనలు మేరకు సూపర్వైజర్ ఇమ్మడి పద్మ పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ బాలింతలు, పిల్లలు, తల్లులు, అమ్మమ్మలు, తాతయ్యలు, తో తల్లుల సమావేశం నిర్వహించడం జరిగింది .ఈ



సమావేశంలో తక్కువ ఖర్చుతో మన పరిసరాల్లోనే దొరికే పండ్లు ఆకుకూరలు,కూరగాయలు, ప్రోటీన్ ఫుడ్స్, గురించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వాటి ఆవశ్యకత గురించి తెలియజేయడం జరిగింది. కేంద్రంలో అన్నప్రాసం లు, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఇమ్మడి పద్మ, ఏఎన్ఎం ఆశా వర్కర్, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, లలిత, విజయలక్ష్మి, సీత, గంగాభవాని, కాంత దేవి, పుష్ప , తల్లులు , పిల్లలు పాల్గొన్నారు.

## 8న ఖమ్మంలో జాబ్ మేళ

**ఖమ్మం కలెక్టరేట్ అక్టోబర్06: (ప్రభాతవార్త)**

జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, అవసర మైన జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సూచించారు. అర్హత, అనుభవానికి అనుగుణంగా ఆయా సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం హెచ్ఆర్ ప్రతినిధులను 7075936289, 9912465999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ప్రైవేటు రంగంలో లభిస్తున్న ఈ ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలకు, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు పొందాలని పేర్కొన్నారు.




## మణుగూరులో డ్రైనేజీ పనులు పరిశీలన



**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 06:**

మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ. 25 లక్షల అంచనా వ్యయంతో అంబేద్కర్ సెంటర్ నుండి బి. నారాయణ ఇంటి వరకు చేపడుతున్న ఇరువైపులా సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యురాలు ఎదలపల్లి శారద పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి లక్షలాది రూపాయల నిధులను కేటాయిస్తూ గ్రామాల ప్రగతికి కృషి చేస్తున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జా త్రిమూర్తులు, ఎండి యాకూబ్ అలీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జేపీసీ కూటమిని గెలిపించండి
## ఈయూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు

**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 06:**



ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో విలీనం జరగాలంటే రాబోయే ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయుల జేఏసీ కూటమిని గెలిపించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు కోరారు. ఆయన మంగళవారం మణుగూరు డిపో ఎదుట పవన్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గతంలో సమ్మె చేసి ప్రభుత్వాన్ని విలీనానికి ఒప్పించిన ఘనత జేఏసీదేనన్నారు. రాత్రికి రాత్రే సంఘాలు మార్చే వారికి కార్మికులు తగిన బుద్ధి చెప్పాలని, బస్సు,కాగడా గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మోలానా, సిపిఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు నారాటి ప్రసాద్, అప్పారావు, జి.ఎస్. నారాయణ, పవన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రైతువేదికకు టేబుల్ అందజేత

**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 06:**

మండలంలోని చినరాయిగూడెం గ్రామానికి చెందిన రైతు సొందె సిద్దార్థ మణుగూరు రైతువేదికలో నిర్వహించే రైతుల సమావేశాలు, అవగాహన కార్యక్రమాలకు ఉపయోగపడేలా టేబుల్‌ను అందజేశారు. ఈ



సందర్భంగా రైతు సిద్ధార్థను మండల వ్యవసాయ అధికారి రాహుల్, విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణ్ రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతులు వర్స శ్రీను, తెల్లం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో 10 శాతం వాటా ఇవ్వాలి

**పాత బకాయిలను వెంటనే చెల్లించాలి..**

**ఇల్లందు సింగరేణి కార్యాలయం ఎదుట కార్మిక సంఘం ధర్నా**





**ఇల్లందు అర్బన్, అక్టోబర్ 6, ప్రభాతవార్త:**

సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 2025-26 వార్షిక లాభాల్లో 10 శాతం బోనస్‌గా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఇల్లందు విభాగంలోని కేటీసీ ఓబీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన వేతనాలు, బోనస్, ఉద్యోగ భద్రతకు సంబంధించిన నిధులు తదితర పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం సింగరేణి ఇల్లందు జీఎం కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రాంతీయ అధ్యక్షులు కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. రాసుద్దిన్, రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి ఉత్పత్తి, లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ కీలకమని పేర్కొన్నారు. కార్మికుల శ్రమను గుర్తించి 2025-26 సంవత్సరానికి సంస్థకు వచ్చిన లాభాల్లో 10 శాతం బోనస్‌గా అందించాలని డిమాండ్ చేశారు. ఇల్లందు విభాగంలోని కేటీసీ ఓబీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తే ఈ నెల 10వ తేదీ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సింగరేణి జీఎం కార్యాలయాన్ని ముట్టడించి పికెటింగ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సింగరేణి జీఎం కార్యాలయ సిబ్బంది బాధ్యతలు నిర్వహిస్తున్న అజ్మీర తుకారాంకు కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కే. సారంగపాణి, రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్, జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు రావూరి ఉపేందర్‌రావు, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. మోహన్‌రావు, టియం చారి, నేపాల్, మోరే వెంకటేశ్వర్లు, బాలు, గంట వెంకటేశ్వర్లు, గోపాల్, సురేష్, ఖయ్యూం, నరసరాజు, రాజు లోత్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కృషి చేస్తాం

**నూతన అధ్యక్షులు మణి కిరణ్, అను బాబు**



**ఇల్లందు, అక్టోబర్ 6, ప్రభాతవార్త:**

ఇల్లందు ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ నూతన అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ నెల 3న 18వ వార్డు కళాసిబస్తీలోని ఆర్యవైశ్య సత్రంలో నిర్వహించిన సంఘ సభ్యుల సమావేశంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల అధ్యక్ష పదవికి పాబోలు మణి కిరణ్, పట్టణ అధ్యక్ష పదవికి నరేంద్రుల అను బాబు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ధారా రమేష్ నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ ఐక్యత, అభివృద్ధికి కృషి చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షులు పాబోలు మణి కిరణ్, నరేంద్రుల అను బాబు మాట్లాడుతూ తమపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన సంఘ పెద్దలు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని సమాజ అభివృద్ధి, ఐక్యతకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గౌరిశెట్టి కృష్ణ, భాను ప్రకాష్, జిల్లా నాయకుడు ధారా ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సిబ్బందికి సత్కారం



**టేకులపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త**

:సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా అంగన్వాడి సిబ్బందికి సత్కరించిన మండల బిజెపి నాయకుడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని 25 సంవత్సరాల ప్రజాసేవకు గుర్తుగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన సేవా సంకల్ప్ లో భాగంగా మండలంలోని ఏ కాలనీ తండా వాగోడ్డు తండా రోళ్లపాడు వీర్య తండా పలు గ్రామాలలో ఈ కార్యక్రమము నిర్వహించినట్టు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బోడ పుణ్య నాయక్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షులు గంగ మండల అధ్యక్షులు శంభు నాయక్ గిరిజన మోర్చా జిల్లా నాయకులు రవిరాథోడ్ సీనియర్ నాయకులు నెల్లూరు సత్యం బాలకృష్ణ ధరావత్ ద్రౌసింగ్ తదితరులు పాల్గొన్నారు

## పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి**



**కొత్తగూడెం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి కోరారు. మంగళవారం ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినా ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై పోరాడుతున్నానని తెలిపారు. గత మూడేళ్లుగా బీఆర్ఎస్ ప్రజలు, పట్టభద్రుల సమస్యలపై పోరాడుతోందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేలా పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సీతా మహాలక్ష్మి, యువనేత అనుదీప్, సీనియర్ నాయకులు జైరాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్ సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

**ఇల్లందు, అక్టోబర్ 6, ప్రభాతవార్త:**





ఇల్లందు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం సందర్శించారు. మార్కెట్‌లో పర్యటించిన ఆయన వ్యాపారుల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యాపార పరిస్థితులు, మార్కెట్‌లోని సౌకర్యాలపై ఆరా తీశారు. వ్యాపారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే వ్యాపారులు, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మార్కెట్ అభివృద్ధికి అవసరమైన చర్యలను మున్సిపల్ అధికారులు చేపట్టాలని సూచించారు. ఇటీవల వ్యాపారుల ఏకగ్రీవ సమ్మతితో ఏర్పాటైన నూతన మార్కెట్ కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే కోరం కనకయ్య శాలువాలతో సత్కరించి అభినందించారు. మార్కెట్ వ్యాపారుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కార్యవర్గ సభ్యులకు సూచించారు. మార్కెట్‌లో వ్యాపారులకు, వినియోగదారులకు మెరుగైన వసతులు అందేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సందీప్, చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండ్యాల రాజు, కూరగాయల నూతన కమిటీ చైర్మన్ ఎస్.కె గౌస్, పెండ్యాల హరికృష్ణ, నారాయణ లోద్, రవి తదితర వ్యాపారులు పాల్గొన్నారు.

# వరి పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి

**పెనుబల్లి, అక్టోబర్ 06, ప్రభాతవా ర్త**

కోంద్రుపాడు, కారాయిగూడెం, తుమ్మలపల్లి, కుప్పెనకుంట్ల గ్రామాల్లో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి ఏ వి ఎస్ ప్రసాద రాజు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కొన్ని వరి పొలాల్లో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలను గుర్తించి, రైతులకు నివారణ, యాజమాన్య పద్ధతులపై సూచనలు అందించారు.

ఈ వ్యాధిలో ఆకుల అంచుల నుంచి పసుపు రంగు మారుతూ పైన నుంచి కిందకి క్రమంగా ఆకులు ఎండిపోవడం , తీవ్రమైన పరిస్థితుల్లో మొక్కలు వాడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పొలంలో అధికంగా నత్రజని ఎరువులు వేయకుండా, సమతుల్య ఎరువుల యాజమాన్యం పాటించాలని, అధిక తేమ, నీటి నిల్వ, గాలి వానల సమయంలో



వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని , వ్యాధి సోకిన పొలం నుంచి మరొక పొలం కి నీటి పారుదల తో కూడా వ్యాపించే అవకాశం ఉన్నదని తెలిపారు.

వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు నియంత్రణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 500 గ్రాములు/ఎకరానికి తో పాటు ప్లాంటోమైసిన్ 40 గ్రాములు లేదా అగ్రిమైసిన్ 80 గ్రాములు/ ఎకరానికి లేదా ఎో షా ఎా ై ని న్ 40గ్రాములు/ఎకరానికి కలిపి పిచికారీ చేయాలి లేదా బాసిల్లస్ సెప్టిలిస్ 400 మి . లీ/ఎకరానికి లేదా కాసుగమైసిన్ 400600 మిలీ. ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.

ఒకే మందును పదేపదే ఉపయోగించకుండా మార్చి మార్చి వారం రోజుల వ్యవధి తో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.




# మినీ క్రీడా మైదానం, లైటింగ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

**కుట్టుశిక్షణ మహిళలకు**

**సర్టిఫికెట్లు పంపిణీ**



**అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 6 (ప్రభాతవార్త):** పట్టణంలోని మినీ క్రీడా మైదానం, లైటింగ్ పనులను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, మైదానం అందుబాటులోకి వచ్చిన తర్వాత స్థానిక యువత, విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారులు, ప్రధాన కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మెరుగైన వెలుగులు ఉండేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ: అనంతరం అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసిన మహిళలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సర్టిఫికెట్లను అందజేశారు. కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు తమ సొంతంగా ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. శిక్షణతో పొందిన నైపుణ్యాన్ని ఆచరణలో పెట్టి ఇంటి వద్ద నుంచే టైలరింగ్ పనులు చేపట్టి ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా దారా రమేష్



**దమ్మపేట, రూరల్ అక్టోబర్ అక్టోబర్ 06 (ప్రభాతవార్త :** తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా దమ్మపేట గ్రామ పంచాయతీ 14వ వార్డు సభ్యుడు దారా రమేష్ నియమితులయ్యారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్, జిల్లా అధ్యక్షురాలు నక్క లక్ష్మీ ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దారా రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం, జిల్లా, రాష్ట్ర స్థాయి ఫోరం నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు, వార్డు సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దారా రమేష్ నియామకంపై దమ్మపేట మండల ప్రజలు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

## ఏఐకెఎస్ 36వ మహాసభలను జయప్రదం చేయాలి

**అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 6 (ప్రభాతవార్త):**



నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య పిలుపునిచ్చారు. మహాసభల విజయాన్ని కాంక్షి స్తూ తెలంగాణ రైతు సంఘం అశ్వారావుపేట మండల కమిటీ సమావేశాన్ని మడకం నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగ సంక్షోభం, పంటలకు గిట్టుబాటు ధర, సాగునీరు, ఎరువులు, విత్తనాల సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి పోరాటాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏఐకెఎస్ మహాసభలు దిశానిర్దేశం చేయనున్నాయని పేర్కొన్నారు. నల్గొండలో జరిగే జాతీయ మహాసభలకు తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం లో రైతు సంఘం నాయకులు సీసం రాంబాబు, సంతపురి చెన్నారావు, తుట్టి వీరభద్రం, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ గెలలు దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు

**మీడియా ముందు హాజరు పర్చిన పోలీసులు**

**దమ్మపేట, అక్టోబర్ 6 (ప్రభాతవార్త):** దమ్మపేట మండలంలో పామాయిల్ తోటలలో రాత్రి వేళల్లో పామాయిల్ గెలలను అక్రమంగా నరికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారిని మీడియా ముందు హాజరు పర్చి వివరాలు తెలిపారు. దమ్మపేటకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు (45) రాత్రి సమయాల్లో తన అప్పి ట్రాలీ ఆటోలో పామాయిల్ తోటల్లోకి ప్రవేశించి గెలలను నరికి తరలించేవాడు. అనంతరం దొంగిలించిన గెలలను అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో విక్రయించేందుకు పెరుమాళ్ల కుమార్ బాబు సహకరించేవాడు. అదేవిధంగా చిట్లూరి పుల్లారావు తన పేరుతో ఉన్న కోడ్ ద్వారా దొంగిలించిన పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలో విక్రయించేందుకు సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల వద్ద నుండి అప్పి ట్రాలీ ఆటో, మడు సెల్‌ఫోన్లు, రూ.20వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, రామకృష్ణ రెడ్డిలను సీఐ అభినందించారు. ఈ సమావేశంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎసఐలు రాజేష్ కుమార్, బాలస్వామినాథం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## రహదారి సమస్య పరిష్కరించండి

**దమ్మపేట రూరల్ అక్టోబర్ 06 (ప్రభాతవార్త :** మందలపల్లి ప్రకాష్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి సమస్యను ఇప్పటికే పాలకమండలి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు పేర్కొన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, అత్యవసర సమయాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకమండలి స్పందించి ప్రకాష్‌నగర్ కాలనీ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోండి: ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, అక్టోబర్ 6 (ప్రభాతవార్త):**



ఖమ్మం, నల్గొండ, వరంగల్ నియోజకవర్గానికి గాను గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పట్టభద్రులు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. మంగళవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అర్హత గల పట్టభద్రులు సంబంధిత వివరాలను పూర్తిగా నమోదు చేసి నమోదు చేసుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చేసుకోవడం మన ప్రజా స్వామ్య హక్కును వినియోగించుకునే ముఖ్యమైన అడుగు అని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలన్నారు.

# విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు

**ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ**

**దమ్మపేట, అక్టోబర్ 6 (ప్రభాతవార్త):** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం మండలంలోని పట్వారిగూడెం, జగ్గారం, నాగుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ క్రమంలో పట్వారిగూడెం గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన కొండా వెంకటలక్ష్మి కుటుంబానికి, నాగుపల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మారగాని విజయ కుటుంబానికి విద్యుత్ శాఖ



ద్వారా మంజూరైన ఒక్కొక్కటి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం పట్వారిగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న గోళ్ల నారాయణని పరామర్శించారు. టీఎం గుంపు గ్రామంలో కంటి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వగ్గెల ముత్యాలరావుని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బూరుగుగుంపు గ్రామంలో కిందపడటంతో చేయి విరిగిన వార్డు సభ్యురాలు సోయం బాలనాగమణిని పరామర్శించారు. నాగుపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. మారగాని నాగేశ్వరరావు, మట్టా రమణ, ఊకే రాజేష్, బొబ్బిలి శ్రీనివాసరావుకి మంజూరైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎసఈ మహేందర్, డిఈ బద్రుపవార్, ఏడీఈ వెంకటరత్నం, ఏఈ రమేష్, ఎలఐలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, ఎసఎలఐ రత్నాజీ, బుర్గుల ప్రసాద్, సర్పంచులు కూరం అర్జున్ రావు, వంకా జానకి రాముడు, ఇస్లావత్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై జిల్లా కలెక్టర్ దశా దిశా నిర్దేశం

**అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలి**

**సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్**

కారేపల్లి అక్టోబర్ 6 ప్రభాతవార్త

సింగరేణి మండలంలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని సకాలంలో వాటిని అమలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మండల అధికారులకు దశ దిశ నిర్దేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఆధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి. ఇందిరమ్మ ఇండ్లు, ఇంకుడుగుంతలు,



విద్యాలయాలకు అదనపు ఏకరూప దుస్తులు, సంక్షేమ శాఖ పనులు తదితర అంశాల పై సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ పూర్తయిందని ఎంఈఓ ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించి జరుగుతున్న



పనులపై ఆరా తీశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పద్మ ఎమ్మార్వో ఒగురుగంటి వెంకటేశ్వర్లు స్పెషల్ అధికారి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన సదుపాయాలు

**గ్రామ సర్పంచ్ హిరాలాల్**

కారేపల్లి అక్టోబర్ 6 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తుందని తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని భాగ్యనగర్ తండా గ్రామ సర్పంచి బానోతు హీరాలాల్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని భాగ్యనగర్ తండా పంచాయతీ లావుడియా తండా పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు కే లోతు రాములు గ్రామ సర్పంచ్ హీ రాలాల్ విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్యా బోధన అందించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని నిర్వహిస్తు విద్యార్థులకు షూస్ దుస్తులు ఉచిత పుస్తకాలు మౌలిక వసతులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తుందన్నారు. విద్యార్థుల పట్ల హెచ్ఎం చూపిస్తున్న నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ప్రశంసించారు..విద్యార్థులకు ప్రత్యేకంగా ఆటలు నిర్వహించడంతోపాటు మానసిక ఉల్లాసానికి మెడిటేషన్ చేస్తున్నట్టు తెలిపారు. తరగతుల వారిగా పిల్లల యొక్క సామర్థ్యాన్ని వారి ప్రగతిని పరిశీలిస్తే



అర్థమవుతుందని పాఠ్య పుస్తకాలను ఉద్దీపకము. ఇంగ్లీష్, గణితము వివిధ సామర్థ్యములలో పిల్లల యొక్క ప్రగతి చదవటం రాయటంలో ముందున్నట్లు తెలిపారు. విద్యార్థుల రైటింగ్ స్కిల్స్ వారి నోటి పుస్తకాలను చూస్తేనే అర్థమవుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాంకడోత్ గాంధీ గుగులోతు బాబు గుగులోతు కుమార్ లావుడియా లచ్చు నాయక్ అంగన్వాడీ టీచర్ సుజాత ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్య పరిరక్షణ పోషణ పై శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలి

**పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి**

**పొన్నెకల్ లో మెగా పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పురేందర్**

కామేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :

పశువుల ఆరోగ్య పరిరక్షణ పోషణ పై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్యం సహాయం పొందాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ పురేందర్ పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం పొన్నెకల్లు గ్రామం లో మంగళవారం ఐసీఏఆర్ -ఎన్ఎంఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు.కామేపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు సారధ్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పాడి




పశువులు, మేకలు, గొర్రెలకు పలు రకాల పశువైద్య సేవలు అందించారు.ఆవులు, గేదెలలో గర్భకోశ, సంతానోత్పత్తికి సంబంధించిన సమస్యలకు చికిత్సలు, సాధారణ వ్యాధులకు వైద్య సేవలు అందించారు.దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, అవసరమైన టీకాలు, ఇతర వైద్య సేవలు అందించారు. పశువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన మందులు,పోషణ సంబంధిత సామగ్రిని రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం ఐసీఏఆర్-ఎన్ఎంఆర్ఐ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో పాడి పశువుల పెంపకం, మేకలు-గొర్రెల పెంపకం, పశువుల పోషణ, సంతానోత్పత్తి, వ్యాధుల నివారణ, శాస్త్రీయ పశుపోషణ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్, ఎన్ఎంఆర్ఐ శాస్త్రవేత్తలు, ఖమ్మం జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పురేందర్, వైరా ఈడీ డి ఎల్ డి ఏ డాక్టర్ కిషోర్, తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌బాబు, ఏడీ డాక్టర్ పందారి బాబు,డాక్టర్ రూఫ్‌కుమార్, డాక్టర్ గంగాధర్, పారా సిబ్బంది వెంకటేశ్వర్లు,శిరీష,కార్తీక్, వంశీ, శరత్, గోపాలమిత్ర సూపర్వైజర్ వెంకటేష్, గోపాలమిత్రులు నాగు, ధర్మ, లక్ష్మయ్య,స్థానిక, సమీప పంచాయతీల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు,పాడి రైతులు, మేకలు,గొర్రెల పెంపకందారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ మెగా పశువైద్య శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు శాస్త్రీయ పశుపోషణపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

## హమాలీలను విస్మరిస్తే సహించేది లేదు ఉద్యమించక తప్పదు

కామేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :

హమాలీ కార్మికులను విస్మరిస్తే సహించేది లేదని, ఉద్యమించక తప్పదని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీలకు ఇచ్చిన హామీ లను తక్షణమే అమలు చేయాలని ఆల్ ఇండి యా హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీ యూ) రాష్ట్ర కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హమాలీ వర్కర్స్ సమావే శంలోమాట్లాడుతూ హమాలీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయ డంతో పాటు పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సం క్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. జిల్లా లోని హమాలీ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి అసంఘటిత కార్మికులుగా నమోదు చేయడంతో పాటు సామాజిక భద్రత పథకాలు వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులందరికీ హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, సహజ మరణ పరిహారం వంటి ప్రయోజనాలు కల్పించాలని కోరారు.55 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు కనీసం రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇల్లు లేని వారికి ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వా లని విజ్ఞప్తి చేశారు. పని ప్రదేశాల్లో మంచినీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. హమాలీ పని చేస్తూ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల ప్రమాద బీమా/ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఐ ఎల్ఓ తీర్మానాల ప్రకారం 50 కిలోలకుపైగా బరువున్న బస్తాలను నిషేధించాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేకంగా హమాలీ నగర్ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నవీన్ రెడ్డి బాదా వత్ శ్రీనివాస్ ,డిమాండ్ చేశారు.




## పోషక పదార్థాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్





కారేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :

తొమ్మిదవ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కారేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మంగళవారం సందర్శించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పోషకాహార పదార్థాలను పరిశీలించి, వాటి వినియోగం, పోషక విలువలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం, స్థానికంగా లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఐసిడిఎస్ పిడి ఆలేటి ప్రమీల, కామేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట అధికారి కె.ఉమా ఉన్నారు.

## నిర్ణీత గడువులో నిర్మాణ పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్



కారేపల్లి, అక్టోబర్ 6 : ప్రభాత వార్త

కస్తూరిబా గాంధీ విద్యాలయంలో నూతనంగా చేపట్టిన భవన నిర్మాణం పనులు నిర్ణీత గడువులో నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సూచించారు. మండల కేంద్రమైన కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికలవిద్యాలయాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర.టి.ఎస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి జి.యూస్నీ సౌజన్య పాఠశాలలోని సమస్యలు, అవసరమైన మౌలిక వసతులపై కలెక్టర్కు వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ మట్టా

**సత్తుపల్లి,ప్రభాతవార్త అక్టోబర్ 6**

సత్తుపల్లి మండలం లో పలు గ్రామాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ మంగళవారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొని పలు కుటుంబాల వారిని పరామర్శించారు. రేజర్ల గ్రామానికి చెందిన బూరుగు శ్రీలత నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై, కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన అదే గ్రామానికి చెందిన పసుపులేటి మురళి ని ఆయన నివాసంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



అలాగే, గ్రామ కాంగ్రెస్ నాయకులు షేక్ ఖలీల్ రెహమాన్ కుమార్తె షేక్ రుతియా బేగం బైక్‌పై నుంచిపడిపోవడంతో గాయపడగా, ఆమె నివాసానికివెళ్లిపరామర్శించారు. అలాగే మండలంలోని కృష్ణారం గ్రామానికి చెందిన ఎమ్మడి బోయిన విష్ణు ప్రియ మృతి చెందటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు పరామర్శించి సానుభూతి తెలిపారు. కందుకూరు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బండి అంజిరెడ్డి సత్తుపల్లిలోని జూపల్లి కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను డాక్టర్ మట్టా ఆనంద్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ భీమిరెడ్డిఅరుణ మాజీ సర్పంచ్ జక్కుల ప్రభాకర్, నరుకుల్ల అప్పారావు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో చేరుటకు ఈనెల 13 చివరి తేదీ

**సత్తుపల్లి అక్టోబర్ 6 ప్రభాతవార్త**

జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 202627 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల నిమిత్తం గడువు ఈ నెల 13 వరకు కలదని కోఆర్డినేటర్ డా. బీపు పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్,డిప్లొమా పాసైన విద్యార్థులుఅర్హులని ఆయనఅన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదవాలనుకునే ఎస్.టి కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ విద్యార్థులకు ఉచిత డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ చేయలేనివారు ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. దూరవిద్యలో పొందిన డిగ్రీకి రెగ్యులర్ విద్యలో పొందిన డిగ్రీతో సమానమైన అవకాశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు ఈనెల13 లోపు చెల్లించాలనితెలిపారు. మరిన్నివివరాలకు9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

## పాత ఎర్రబోయినపల్లి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై విచారణ జరపాలి

**కల్లూరు, అక్టోబర్ 06, ప్రభాతవార్త**

పాత ఎర్రబోయినపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ 3 కేంద్రం సక్రమంగా నిర్వహించడంలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్ క్రమం తప్పకుండా హాజరు కావడం లేదని, పిల్లల హాజరు కూడా సక్రమంగా నమోదు కావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పిల్లలు లేకుండానే అంగన్‌వాడీ కేంద్రం నడుస్తున్నట్లు, జీరో అటెండెన్స్‌తో కేంద్రం నిర్వహిస్తున్నట్లు కనిపిస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య, ఇతర అంగన్‌వాడీ సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయంపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని కోరుతున్నారు.అంగన్‌వాడీ కేంద్రం హాజరు రిజిస్టర్, పిల్లల వాస్తవ హాజరు, టీచర్ హాజరు, పౌష్టికాహారం పంపిణీ తదితర అంశాలపై సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. తప్పులు ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.పిల్లల భవిష్యత్తుతో ముడిపడిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని పాత ఎర్రబోయినపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.



## ప్రభుత్వ భూమి పరిశీలించిన మట్టా దయానంద్

**పెనుబల్లి, అక్టోబర్ 06, ప్రభాతవార్త**



పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మంగళవారం ప్రభుత్వ భూమిని పరిశీలించారు. గ్రామంలోని దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునే విధంగా వినియోగించే అంశంపై ఆయన పరిశీలన చేపట్టారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా భూమి అందించి, వారి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## శ్రీరామగిరి నీ సందర్శించిన జడ్పి సిఈఓ

**నెల్లికుదురు అక్టోబర్ 06 ప్రభాతవార్త** :మండలంలోని శ్రీరామగిరి గ్రామాన్ని మహబూబాబాద్ జడ్పి సీఈవో,ఇంచార్జ్ (ఏసిఎల్బి ) డి పురుషోత్తం మంగళవారం సందర్శించారు వివిజి రాంజీ పథకంలో గ్రామ రైతు గుగులోతు రవి తన వ్యవసాయ క్షేత్రంలో నిర్మిస్తున్న ఫారం ఫండ్ పనులను ఎంపీడీవో సింగారపు కుమార్ తో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా పని వివరాలు అడిగి తెలుసుకున్నారు జరుగుతున్న పనుల పురోగతిని దగ్గరుండి పరిశీలించారు రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమం లో సర్పంచ్ మాదరి ప్రశాంత్, ఉప సర్పంచ్ రామగిరి సుమన్, ఎంపీటీ వెంకటరమణ, ఏపిఓ, ఈసి, టిఏ లు, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు

## మాజీ ఉప రాష్ట్రపతి అభినందనలు పొందిన చిత్రకారుడు పిచ్చయ్య

**సత్తుపల్లి అక్టోబర్ 6 ప్రభాత వార్త**





ఒంగోలు పట్టణ 150 వసంతాల ప్రస్థానం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో జరిగిన చిత్రలేఖన పోటీలలో సత్తుపల్లి ప్రాంత ప్రముఖ చిత్రకారుడు పల్లం పిచ్చయ్య ద్వితీయ బహుమతిగా పదివేల రూపాయలుఅందుకున్నారు. ఈ సందర్భంగా పిచ్చయ్యను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందనలు అందచేశారు.ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ పోటీలో ఒంగోలు ప్రాంతానికి చెందిన ప్రముఖవ్యక్తులు,కట్టడాలు,వారసత్వసంపద,సంస్కృతి, వివిధ సంఘటనలు ఇతి వృత్తాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో చిత్రలేఖన పోటీలను ఇటీవలనిర్వహించారు.వీటన్నిటి సమ్మేళనంగా పిచ్చయ్య గీసిన చిత్రం ద్వితీయ బహుమతి సాధించి వెంకయ్య నాయుడు ప్రత్యేక ప్రశంశలు పొందింది. మంగళవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో పిచ్చయ్య బహుమతి స్వీకరించారు. ఈ సందర్భంగాపిచ్చయ్యను సృజన సాహితీ సమాఖ్య అభినందనలు తెలిపింది.

# అర్హులైన వారికి పెన్షన్లను ఇవ్వాలి

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రదర్శన ధర్నా**

**సత్తుపల్లి అక్టోబర్ 6 ప్రభాత వార్త**

జిల్లాలో విద్యుత్ కోతలు పెరగటానికి, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడానికి, వేయి రోజుల పరిపాలన లో అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వలేకపోవడానికి, కేంద్ర ప్రభుత్వ నూతన విద్యుత్ సవరణ చట్టం పేరుతో విద్యుత్ మీటర్లు బిగించడం లాంటి సమస్యల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు.. మంగళవారం నీలం రామచంద్రయ్య భవనం నుంచి కాకర్లపల్లి రోడ్ రింగ్ సెంటర్ మీదిగా ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాచేసి ఎంపీడీవో సిహెచ్ నాగేశ్వరరావు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రంగారావు




మాట్లాడుతూ, జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా విద్యుత్ కోతలు పెరగటం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంటు కోతల వలన నీరు లేక రైతాంగం వేసిన పంటలు నిండిపోతున్నాయని, కౌలు రైతులు పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారనారు. నిత్యావసర సరుకుల ధరలు నేడు ఆకాశాన్ని అంటే విధంగా పెంచడం వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమకు వచ్చే అల్పాదాయంతో కొనలేని ఆర్థికలి తో జీవించాల్సిన స్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మో పడం, ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం చేస్తూ పోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య, జిల్లా నాయకులు గంట శ్రీనివాస్, బిరెల్లి లాజర్, అమర్లపూడి శరత్, డివిజన్ నాయకులు రాజువెంకటేష్, నాగిరెడ్డి, పుల్లారావు,మ్యాలాద్రి రాజారావు,నాగ ప్రసాద్, దేవి అలివేలు, వెంకటమ్మ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద గొయ్యిని పూడ్చాలి

**కల్లూరు, అక్టోబర్ 06, ప్రభాతవార్త**



కల్లూరు సెంటర్ లో మధిర రోడ్ కార్నర్ సౌమ్య మెడికల్ ముందు పెద్ద గొయ్యి ఏర్పడటంతో కల్లూరు మున్సిపాలిటీ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గోతిలో లోగడ రెండు సార్లు తాత్కాలికంగా మట్టి పోసి వదిలేశారు. అలా కాకుండా లోపల నుండి బాగు చేసి వేస్ట్ వాటర్ డ్రైనేజ్ లోకి పోయే విధంగా ఏర్పాటు చేసి కంకర పోస్తే బాపుంటుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు పట్టించుకుని జరగబోయే ప్రమాదాలను నివారించాలని, తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారాన్ని అందించాలని కల్లూరు మున్సిపాలిటీ ప్రజానీకం కల్లూరు మున్సిపాలిటీ పాలకవర్గం అధికార యంత్రాంగం లను అభ్యర్థిస్తున్నారు.

# దివ్యాంగులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

**దివ్యాంగుల కన్నీళ్లు తుడిచేందుకు బీజేపీ అండగా నిలస్తుంది.**

**బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి**

వెల్లడి నేలకొండపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త



: దివ్యాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నేలకొండపల్లి లోని పీఎస్ఆర్ సెంటర్ నందు మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనం ను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఎవరికి తీసిపోరని అన్నారు. వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాలలో తమ ప్రతిభ ను చాటుతారని అన్నారు. ఆత్మగౌరవం, స్వాలంభన కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.6 వేలు ఇస్తామని ఓట్లు వేయించుకుని ఆ తరువాత హామీని అమలు చేయకపోవటం దారుణం అన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేకుంటే వారు చేసే ఆందోళనకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. దివ్యాంగుల కన్నీళ్ల ను తుడిచేందుకు బీజేపీ అవసరమైతే పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీజేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య, నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు షేక్. షరీఫుద్దీన్, మన్నె కృష్ణారావు, అనంతు ఉపేందర్ గౌడ్, కోటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.




## స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

.కూసుమంచి, అక్టోబర్ 6 (ప్రభాతవార్త ) :

కూసుమంచి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూసుమంచిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించడానికి అర్హత కలిగిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన నియమాకంపై నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు పని చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ట్రైనింగుకు సంబంధించిన ధ్రువ పత్రాలతో ఈ నెల 8 వ తేదీలోగా కూసుమంచి ఉన్నత పాఠశాల

# ప్రతీ కాలేజీలో డిజిటల్ బోర్డు బోధన జరగాల్సిందే

**వచ్చే నెల నుంచి విద్యార్థులకు అల్పహారం అందించేందుకు ఏర్పాట్లు**

**జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కే.రవిబాబు**

నేలకొండపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త:



ప్రతీ కాలేజీలో డిజిటల్ బోర్డు ద్వారానే విద్య బోధన నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు వెల్లడించారు. మంగళవారం నేలకొండపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్య బోధన ను పరిశీలించారు. విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందించారు. ఆధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ మీడియట్ విద్యార్థులకు వచ్చే నెల నుంచి అల్పాహారం ను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కాలేజీ లకు కిచెన్ షెడ్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. గతేడాది 67 శాతం ఫలితాలు సాధించామని, ఈ ఏడాది నూరు శాతం సాధించేందుకు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఫలితాలు, సౌకర్యాల కల్పన వలన 500 శాతం అడ్మిషన్స్ కూడ పెరిగినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పై సమీక్షమండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల సర్వే పై మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు సమీక్ష నిర్వహించారు. పలు శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కే.రవిబాబు మాట్లాడుతూ మొదటి విడత లో 678 ఇళ్ల కు గాను 619 ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిలిగిన 25 ఇళ్లు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో విడత లో 549 మంజూరు కాగా 249 దరఖాస్తులు వచ్చినట్లు వాటిలో 106 ఇళ్లు ఎల్1 లో ఉన్నాయని వాటి సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఎల్2 లో 9 ఇళ్లు, ఎల్3 లో 122 ఉన్నట్లు తెలిపారు. సర్వే ను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నివేదికన కలెక్టర్ కు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

## వరి సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలి

కూసుమంచి, అక్టోబర్ 6 (ప్రభాతవార్త ) :



వరి సాగు చేసిన రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు విజృంభిస్తున్న వైరస్, బ్యాక్టీరియా ల వ్యాప్తి పట్ల ప్రమోత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి రైతులకు సూచించారు. మంగళవారం కూసుమంచి మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో వరి పొలాలను ఆమె పరిశీలించారు. పంటను పరిశీలించిన అనంతరం వరి పంటలో పాము పొడ తెగులు , బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు.రైతులు ఈ తెగుళ్ల నివారణకు తగిన చర్యలు పాటించాలని సూచించారు. పాము పొడ తెగులు నివారణకు, హెక్సాకోనజోల్ 5శాతం ఈసీ మందును 1 మి.లీ. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని , అవసరమైతే 12-15 రోజుల తరువాత రెండోసారి పిచికారీ చేయాలని తెలిపారు. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు నివారణకు, స్ట్రెప్టోసైక్లిన్ 30 గ్రాములతో పాటు కాపర్ ఆక్సీక్లోరైడ్ 200 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. తెగులు కనిపించిన పొలాల్లో అధికంగా యూరియా వేయకుండా, పొలంలో నీటిని నిల్వ ఉంచకుండా తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

# మూడున్నర దశాబ్దాల నుండి దొడ్డ వర్ధంతి సభలు

**ఆనాడు దొడ్డ మరణంతో అసెంబ్లీలో బోడెపూడి ప్రభుత్వ హత్యగా సర్కారుపై తీవ్ర ఆగ్రహం**

**జిల్లా వ్యాప్తంగా ఆనాడు సిపిఎం ఆందోళన**

తల్లాడ అక్టోబర్ 6 ప్రభాతవార్త

అప్పటివరకు అన్నారుగూడెం గ్రామంలో సిపిఎం లో దివంగత దొడ్డ కృష్ణయ్య సాధన కార్యకర్త 1993లో ప్రత్యర్థులు దొడ్డ కృష్ణయ్య ను హత్య చేయడం ద్వారా సిపిఎం కు గుర్తింపు లభించినట్లు అయింది దొడ్డ కృష్ణయ్య హత్య చేయడం ద్వారా ప్రత్యర్థులు సాధించింది లేకపోగా ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందో నేటి వరకు సమాధానం కూడా లేదని చెప్పవచ్చు మండలం లో అప్పటివరకు సిపిఎం పార్టీ ఆరేడు గ్రామాల్లో పటిష్టంగా ఉంది 1980 కి ముందు దొడ్డ కృష్ణయ్య తండ్రి దొడ్డ నారాయణ సర్పంచ్ గా సిపిఎం నుండి విజయం సాధించిన ఆ తర్వాత గ్రామంలో కాంగ్రెస్ ది పై చేయి కృష్ణయ్య మరణాంతరం సిపిఎం నాయకులు కృష్ణయ్యను హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆనాడు జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేయడం శాసనసభలో ఆనాడు సిపిఎం పక్ష నాయకుడిగా దివంగత బోడేపూడి వెంకటేశ్వరరావు ఉండడంతో ఈ అంశాన్ని శాసనసభలో లేవనెత్తడం రాష్ట్ర జిల్లా నాయకులు అన్నారుగూడెం గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం పార్టీ పటిష్టత కూడా ఎంతో దోహదపడింది దాదాపు రెండు దశాబ్దాలు సిపిఎం నాయకులు దొడ్డ కృష్ణయ్య హత్యను పతాక స్థాయిలో ప్రచారం చేయడం దానిని అనుకూలంగా మార్చడంలో 100 విజయవంతం అయ్యారు అప్పట్లో కట్ట వెంకట నరసయ్య ఎమ్మెల్యేగా తమ్మినేని ఎంపీగా భద్రాచలం పార్లమెంట్ సభ్యుడిగా మీడియం బాబురావు సైతం అన్నారుగూడెం పై ఫోకస్ పెంచడం నోముల నరసింహయ్య కూడా బోడెపూడి మరణాంతరం సిపిఎం శాసన పక్ష నాయకుడిగా ఉండి అన్నారుగూడెం రావడం అలాగే సాయిధ పోరాట యోధురాలు దివంగత మల్లు స్వరాజ్యం లాంటి నాయకులు అన్నారుగూడెం చుట్టూ తిరిగి పార్టీ కి జీవం పోసి జిల్లా స్థాయిలోని ప్రత్యేకతను సంతరింప చేయడం కోసం చేసిన కృషి ఫలించింది ఆ నేపథ్యంలో తల్లాడకు మూడోసారి ఎంపీపీ జడ్పిటిసి ఎన్నికల్లో ఎంపీపీ జడ్పిటిసి



అభ్యర్థులుగా సిపిఎంకే పట్టం కట్టారు విచిత్రం ఏమిటంటే ఆనాడు పార్టీ పెరగడంతో నాయకులు మధ్య విభేదాలు కూడా తారాస్థాయికి చేరడంతో ఎంపీపీ అభ్యర్థి గా తల్లాడకు చెందిన చల్ల రంగయ్య సిపిఎం పార్టీ సీనియర్ నేత తాత భాస్కరరావు సతీమణి సుమతి బాయ్ ని ఎంపీటీసీగా గెలిపించి సత్తా చాటారు ఆనాడే పార్టీ పటిష్టంగా ఉండగా నేతల మధ్య పోరు బయట గ్రామాలను నాయకులు అన్నారుగూడెం నుండి గెలిపించుకునే సంస్క ృతికి తెరదించారని చెప్పవచ్చు అలాగే దొడ్డ కృష్ణయ్య హత్యకు ప్రతీకారంగా ఏడాదిలోపే సిపిఎం నాయకులు దిరిశాల శ్రీకాంత్ ను హత్య చేయగా ఆ తర్వాత జరిగిన పరిణామాలు కాంగ్రెస్ కు కొన్ని సందర్భాల్లో నష్టం కలిగించాయి అప్పటినుండి గ్రామంలో ఒక్కో ఎన్నికలు ఒక్కో పార్టీ పై చేయి సాధిస్తూ వచ్చింది. రెండు హత్యలు ఓ కుటుంబానికి కడుపుకోత మరొకరికి గుండె కోత మిగిల్చి హత్యల నేపథ్యంలో కొందరి నీ ధనవంతుల్ని కూడా చేసింది ఆనాడు సాధారణ వ్యాపారులు నేడు కోట్లకు పడగలెత్తి సత్య హరిచంద్రులుగా మెలిగే పరిస్థితి కి వచ్చిందంటే ఎవరి హత్యలు ఎవరికి లాభం చేకూరిందో అర్థమవుతుంది ఏది ఏమైనా మూడున్నర దశాబ్దాల నుండి దొడ్డ కృష్ణయ్య వర్ధంతి సభలు ఆయన సోదరుడు దొడ్డ శ్రీనివాసరావు ప్రజల భాగస్వామ్యంతో ఏడాదికోసారి గ్రామ లో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయం

## తల్లాడ మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడిగా తూము



తల్లాడ అక్టోబర్ 6 ప్రభాతవార్త

తల్లాడ మండలం రేషన్ డీలర్ ల సంఘం అధ్యక్షుడిగా తూము నరసింహారావు కార్యదర్శిగా నల్లగట్ల కృష్ణ గౌరవ అధ్యక్షుడిగా పత్తిపాటి కేసును ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు డి దర్గయ్య తెలిపారు అలాగే కోశాధికారిగా బానోతు బాలకృష్ణ ఉపాధ్యక్షుడిగా మేడేపల్లి వెంకటాచారి మహిళా ప్రతినిధిగా రాయల బిందు మాధవి ఎన్నుకున్నట్లు తెలిపారు

# అక్టోబర్ 8న ఖమ్మంలో జాబ్ మేళా

**ఖమ్మం కలెక్టరేట్ అక్టోబర్06: (ప్రభాతవార్త)**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగం హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్, లెఅర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ లలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 8, 2026 (గురువారం) నాడు ఖమ్మంలోని టిటిడిసి, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో వివిధ ఉద్యోగాలు : హరేకృష్ణ మూవ్మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత బ్యాక్ గ్రౌండ్‌తో ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. 1-5 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి ములకపల్లిలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు, నెలకు రూ. 20 వేల నుండి 35 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత బ్యాక్‌గ్రౌండ్‌తో ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 21-35 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 5 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ అనుభవంతో అర్హులని తెలిపారు. ములకపల్లి వర్క్ లొకేషన్ కాగా, నెలకు రూ.20 వేల నుండి 35 వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. మరో డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జ్ పోస్టుకు 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 1-3 సంవత్సరాల అనుభవంతో అర్హులని, వేతనం నెలకు రూ.18 వేల నుండి 25 వేల వరకు ఉంటుందని తెలిపారు. మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత బ్యాక్‌గ్రౌండ్‌తో ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులు. 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ అనుభవం ఉన్న వారికి నెలకు రూ.20 వేల నుండి 30 వేలు వేతనంతో ములకపల్లిలో ఉద్యోగ అవకాశం ఉంటుందని తెలిపారు. స్టోర్ ఇన్‌చార్జ్ పోస్టుకు హోటల్/ఫుడ్/హాస్పిటాలిటీ రంగంలో సంబంధిత అర్హత కలిగిన 21-35 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 3-5 సంవత్సరాల అనుభవంతో అర్హులని, నెలకు రూ.25 వేల నుండి40 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. స్టోర్ హెల్పర్ పోస్టుకు 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని, 1-3 సంవత్సరాల అనుభవంతో నెలకు రూ.18 వేలు నుండి 23,000 వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. క్వాలిటీ విభాగంలో అవకాశాలు : క్వాలిటీ ఇన్‌చార్జ్ పోస్టుకు బ్యాచిలర్ ఇన్ ఫుడ్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన 30-40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 5-10 సంవత్సరాల అనుభవంతో అర్హులని తెలిపారు. ములకపల్లిలో విధులు నిర్వహించాల్సి ఉండగా, నెలకు రూ.60 వేల నుండి 80 వేల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు బ్యాచిలర్ ఇన్ ఫుడ్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన 21-40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 3-5 సంవత్సరాల అనుభవంతో అర్హులని, నెలకు రూ.25 వేలు నుండి 40 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు బ్యాచిలర్ ఇన్ ఫుడ్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 1-3 సంవత్సరాల అనుభవంతో అర్హులని, నెలకు రూ.20 వేలు నుండి 25 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. కుక్స్/చెఫ్స్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు, 5-10 సంవత్సరాల అనుభవంతో అర్హులని తెలిపారు. ములకపల్లిలో ఉద్యోగ అవకాశం ఉండగా, వేతనం అనుభవం, అర్హతల ఆధారంగా నిర్ణయించబడుతుందని పేర్కొన్నారు. ఐటీ, హెచ్‌ఆర్ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు : ఐటీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు కంప్యూటర్/సైన్స్ లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు సంబంధిత బ్యాక్‌గ్రౌండ్ కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 1-3 సంవత్సరాల అనుభవం అవసరమని, ములకపల్లిలో ఉద్యోగం, నెలకు రూ.20 వేల నుండి 30 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఏదైనా డిగ్రీ/ఎంబీఏతో పాటు సంబంధిత అనుభవం కలిగిన 21-30 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 3-5 సంవత్సరాల అనుభవం అవసరమని, ములకపల్లిలో ఉద్యోగం, నెలకు రూ.20 వేల నుండి 30 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. లెఅర్నెట్ స్కిల్స్ లిమిటెడ్‌లో ఇన్ఫోసిస్ గీత్ ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్ : ఇన్ఫోసిస్ గీత్ (ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ) ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్ కోసం కూడా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి తెలిపారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 19-28 సంవత్సరాల వయస్సు గల పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశానికి అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయస్సు సాధారణంగా 19 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. అయితే ప్రతి పోస్టుకు నిర్దేశించిన ప్రత్యేక వయోప రిమితి, విద్యార్హత, అనుభవాన్ని అనుసరించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని , తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అక్టోబర్ 8, 2026 (గురువారం) ఉదయం 10.00 గంటలకు టిటిడిసి, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా, ఖమ్మంలో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి కోరారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, అవసరమైన జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత, అనుభవానికి అనుగుణంగా ఆయా సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం హెచ్‌ఆర్ ప్రతినిధులను 7075936289, 9912465999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ప్రైవేటు రంగంలో లభిస్తున్న ఈ ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలకు, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బ్లాక్ లిస్టులో పెట్టిన భూముల వివరాలు బహిర్గతం చేయండి



**తల్లాడ అక్టోబర్ 6 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం 22 ఏ నిషేధిత భూముల వివరాలు బహిర్గతం చేయాలని సిపిఎం నేతలు పొన్న వెంకటేశ్వరరావు బి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం తల్లాడ లో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే వివరాలు వెల్లడించాలని కోరారు పార్టీ కార్యాలయం నుండి రింగ్ సెంటర్ గుండా పార్టీ కార్యానికి చేరుకున్నారు భూ సర్వే చేసిన అనంతరం మిగులు భూములు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పదో తేదీన జిల్లా కేంద్రం నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మెరుగు సత్యనారాయణ శీలం సత్యనారాయణ రెడ్డి జాజిరి శ్రీనివాసరావు పులి కృష్ణ రామలింగేశ్వర రావు తాళ్లపల్లి కృష్ణ తన్నీరు కృష్ణార్జును రావు పాల్గొన్నారు

## స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**కామేపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త :**

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ ను తాత్కాలిక ప్రాతిపదికన నియమించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు పి.జ్యోతి మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 8 వరకు దరఖాస్తు చేసు కోవాలని కోరారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పాఠశాల స్థాయిలో సమగ్ర విద్య అం దించడంతో పాటు వారికి అవసరమైన ప్రత్యేక విద్యా సాయం, మార్గదర్శకత్వం, భవిత కేంద్రాల ద్వారా సేవలు అందించేందుకు ఈ నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. బీఈడీలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉన్నవారు అర్హులని, ఎంపికైన ఎడ్యుకే టర్ నవంబర్ నుంచి మార్చి 2027 వరకు ఐదు నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.నెలకు రూ.16,500 గౌరవ వేతనం అందుతుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, అర్హతలు, స్థానికత, మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఆమె తెలిపారు.

## వడిచర్ల ఎంపీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీచేసిన కలెక్టర్

**లింగాలఘణపురం, ప్రభాతవార్త :**

లింగాలఘణపురం మండలం వడిచర్ల గ్రామంలోని మండలపరిషత్ పాఠశాల (ఎంపీఎస్) జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీచేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని తరగతిగదులు, సరుకుల నిల్వగది, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని, విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూప్రకారం, రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాలలో సరిపడా బెంచీలు



లేనివిషయాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే 15బెంచీలు అందిస్తామని తెలిపారు. కొన్నిగదుల్లో తలుపులు, కిటికీలు పాడైపోయినట్లు గుర్తించిన కలెక్టర్, వాటి మరమ్మతులకు అవసరమైన నిధులకోసం ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. విద్యార్థులు సాధారణ దుస్తుల్లో ఉండటాన్ని గమనించిన కలెక్టర్, వారికి ఏకరూప దుస్తులను అందించలేదా అని ఆరాతీశారు. ప్రతివిద్యార్థి తప్పనిసరిగా ఏకరూప దుస్తులను ధరించి, పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఖాళీగాఉన్న గదులను శుభ్రంచేసి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేరీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఆయా ఆరోగ్య పరిస్థితిపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. తనిఖీలో పాఠశాల హెచ్‌ఎం సరిత, పంచాయతీ సెక్రటరీ రమ్య, సర్పంచ్ సి.హెచ్. కార్తీక్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## నకిలీ సందేశాలకు ఎవరూ స్పందించవద్దు...

### ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి....

**ములుగు జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**

తన పేరు, ఫొటోను ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు పంపుతున్న నకిలీ వాట్సాప్ సందేశాలకు ఎవరూ స్పందించవద్దని,ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పేరు, ఫొటోను వాట్సాప్ డి.పి.లో పెట్టుకుని +66 98 476 2993 నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తన పేరు, ఫొటో కనిపించినంత మాత్రాన అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాలను విశ్వసించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాంటి సందేశాల ద్వారా డబ్బులు, బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కోరారు. సైబర్ నేరగాళ్లు ప్రముఖుల పేర్లు, ఫొటోలను ఉపయోగించి ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. తన పేరుతో అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలు, అధికారులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.